Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు • స్థాపితం: 1930 • జీవనప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

*Longest Living Newspaper in Telugu Journalism*

# జమీన్ రైతు

సంపుటి: 80 • సంచిక: 41 • 25-9-2009 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

షైన్ సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల
డా॥ SK. మహమ్మద్ అలీ

కేర్ సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల
డా॥ ఆలూరు స్వరూప్‌కుమార్‌రెడ్డి, MDS.
Asst. Professor Endodontics
నెల్లూరు - ఫోన్ : 2303300

● ఎటు వెళ్లాలో జగన్‌కు తెలియడం లేదు

# తిరుగుబాటా? సర్దుబాటా?

ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిత్వం ఇప్పుడు మాత్రమే కాదు, ఎప్పటికైనా వైఎస్ జగన్‌కు దక్కుతుందా? కాంగ్రెస్ వాదులందరినీ వేధిస్తున్న ప్రశ్న ఇది. తండ్రి మరణంతో ఆ పదవి దానంతట అదిగా వచ్చి తన ఒళ్లో వాలుతుందని భ్రమపడ్డాడు జగన్. అది తన హక్కుగా, తమ కుటుంబ ఆస్తిగా భావించాడు. తండ్రి అంత్యక్రియలు, మహా అయితే సంతాపదినాలు ముగియగానే తాను గద్దె ఎక్కడం ఖాయం అనుకొన్నాడు. తనకు ఎవరూ పోటీ రారని, రాలేరని అనుకొన్నాడు. దానికి తగ్గట్లే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మొత్తం ఆయన వెనుక నిలబడింది మంత్రులు, ఎమ్మెల్యేలు ఒక్కరు తప్పిపోకుండా అండగా నిలిచారు. జగన్‌ను ముఖ్యమంత్రి చేయకుంటే ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తామని ప్రతిజ్ఞలు చేశారు. తమ తమ నియోజకవర్గాలలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నారు. కొత్త ముఖ్యమంత్రి రోశయ్యను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలపడానికి కూడా ఇష్టపడడం లేదు. కనీసం ఆయన్ను ముఖ్యమంత్రిగా కూడా గుర్తించడం లేదు.

రాష్ట్ర చరిత్రలో ఒక కాంగ్రెస్‌వాదికి పార్టీ నుంచి ఇంత ఉధృత స్థాయిలో మద్దతు లభించడం ఇదే ప్రథమం. గతంలో ఏ ముఖ్యమంత్రికి, చివరకు వైఎస్ రాజశేఖరరెడ్డికి కూడా ఈ తరహా ఆదరణ లభించలేదు. జగన్‌కు వ్యతిరేకంగా మాట్లాడడానికి, చిన్న ప్రకటన చేయడానికి ఏ కాంగ్రెస్ నాయకుడూ సాహసించలేక పోతున్నాడు. జగన్‌ను కాదంటే తాము వూళ్లలో తిరగలేమన్న భయం ఏర్పడి వుంది.

రాష్ట్రంలో ఇంతటి అనూహ్యమైన అపూర్వమైన, అపురూపమైన మద్దతు పొందిన జగన్‌ను ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్టానం మాత్రం పట్టించుకోవడం లేదు. జగన్ శిబిరాన్ని తీవ్ర ఆశాభంగానికి గురిచేస్తున్న పరిణామం ఇది. సంతాప దినాలు పూర్తికాగానే అధిష్టానం తనకు ముఖ్యమంత్రి పదవి అప్పచెప్తుందని చాలా నమ్మకంతో వుండినాడు జగన్. గత శనివారం (19తేది) తనకు ఢిల్లీ పిలుపు ఖాయంగా వస్తుందని ఎదురు చూశాడు. కానీ పిలుపు సంగతి దేముదెరుగు, అసలు ఆంధ్రా విషయాల మీద ఒక్క క్షణం మనసు పెట్టి ఆలోచన చేయడానికీ తీరిక లేకుండా వుంది అధిష్టానం. మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల సన్నాహాలలో తలమునకలుగా వున్నారు వారు. సంతాప దినాలు ముగిసి మూడు వారాలు గడుస్తున్నా ఢిల్లీ నుంచి ఏ స్పందన లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురై, మౌనంగా ఇడుపులపాయ వెళ్లిపోయాడు జగన్. తన తండ్రి మరణించిన పావురాల గుట్ట సందర్శించి, బెంగుళూరు వెళ్లాలని నిర్ణయించుకొన్నాడు. విజయదశమి ముగిసిన తర్వాత కానీ హైదరాబాద్‌కు రాకపోవచ్చు.

అప్పుడు వచ్చినా ఏమి చేయాలి అన్నది ప్రశ్న. తమ అంచనాలు, ఆశలు ఇంతగా భగ్నమై పోవడం జగన్‌ను, ఆయన శిబిరాన్ని తీవ్రంగా కలిచి వేస్తున్నది. ఇట్లా ఎందుకు జరిగిందన్నది వారికి అర్థం కావడం లేదు. అధిష్టానం ఉద్దేశం ఏమిటో అంతుచిక్కడం లేదు. జగన్ వ్యాపారాల మీద, వైఎస్ మరణం పట్ల ఖేదంతో జరిగిన ఆత్మహత్యల మీద ఢిల్లీ ఆంగ్ల దినపత్రికలలో వచ్చిన వ్యతిరేకవార్తలు తమ అవకాశాలను దెబ్బతీశాయా అన్న ఆవేదన వారిని వేధిస్తున్నది. కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు అత్యుత్సాహంతో వైఎస్ శవాన్ని ఖననం చేయక ముందే జగన్ ముఖ్యమంత్రిత్వం డిమాండ్ విన్పించడం అధిష్టానం మనసు విరిచి వేసిందా అన్న ఆలోచన కూడా బాధ పెడుతున్నది.

అధిష్టానం ఇప్పటివరకు జగన్‌కు ముఖ్యమంత్రిత్వం ఇవ్వమని చెప్పలేదు. ఇస్తామని హామీ ఇవ్వలేదు. రోశయ్య ఆ పదవిలో కొనసాగుతాడని ప్రకటించలేదు. అట్లని తాత్కాలిక ముఖ్యమంత్రి అనడం లేదు. మహారాష్ట్ర ఎన్నికల తర్వాత ఈ విషయం పరిశీలిస్తామని చెప్ప

కొరవ 14వ పేజీలో









# సమర్ధతకు పరీక్ష

కొత్త ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విచిత్రమైన పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఆయన ముఖ్యమంత్రి కావడమే ఒక విచిత్రం. ఎవరూ వూహించని విషాదపరిస్థితులలో తప్పనిసరి బాధ్యతగా మాత్రమే ఆ పదవి స్వీకరించారు. అది తనకు కావాలని ఆయన కోరుకోలేదు. దాని కోసం వెంపర్లాడలేదు. వచ్చిందన్న సంతోషమూ లేదు. ఒకవేళ పోతుందన్న దుఃఖమూ లేదు. ఆయన కోరుకొన్నా, కోరుకోకపోయినా ఇప్పుడు ఆయన ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రి. పది కోట్ల మంది ప్రజలకు పాలనాధిపతి. దానితో పాటుగా వచ్చే గౌరవ మర్యాదలతో పాటు, చరిత్రలో స్థానంతోపాటు, అవధిలేని అధికారాలతో పాటు, ప్రజలకు సుపరిపాలన అందజేయవలసిన కర్తవ్యం కూడా ఆయన భుజాల మీద వుంది.

రాష్ట్ర రాజకీయాలలో రోశయ్య కంటే అనుభవజ్ఞుడు మరొకరు లేరు. ఏ పార్టీలో కూడా లేరు. యాభై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితం ఆయనది. ప్రజా జీవితంలో అత్యున్నత నైతిక ప్రమాణాలకు, పోరాటపటిమకు పేరెన్నికగన్న ఆచార్య ఎన్‌జి.రంగా వంటి సుప్రసిద్ధుల శిక్షణలో పెరిగినవాడు. నలభైఏళ్ల క్రితమే చట్ట సభలలోకి అడుగు పెట్టాడు. ప్రతిపక్ష నాయకుడిగా డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, ఎన్టీరామారావు వంటి ముఖ్యమంత్రులకు చెమటలు పట్టించాడు. మంత్రిగా అరడజను మంది ముఖ్యమంత్రులకు అండగా నిలిచాడు. 15సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆర్థిక మంత్రిగా గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డుకు ఎక్కాడు. ప్రభుత్వ నిర్వహణపై అంత అవగాహన, అనుభవం కల్గిన వాడికి ముఖ్యమంత్రిగా వ్యవహరించడం మంచినీళ్ల ప్రాయం కావాలి.

కానీ చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిల తర్వాత ఆ పదవిలోకి రావడం ఒక రకంగా ఆయన దురదృష్టం. ఆ ఇద్దరు నేతలు రాష్ట్ర పరిపాలనలో కొత్త పుంతలు తొక్కారు. చంద్రబాబు నాయుడు, ఐటీ రంగ అభివృద్ధితో ఆంధ్ర రాష్ట్రానికి ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిపెడితే; వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల విస్తృత అమలులో దేశమంతటి దృష్టి ఆకర్షించాడు. వారి తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు వారిని మరపించగల్గితేనే ప్రజల మన్ననలు పొందగలుగుతారు. ఆ లక్ష్యం రోశయ్యకు అసాధ్యమన్న మాట నిజం. ఆయన రాజకీయ శైలి, తామరాకు మీద నీటిబొట్టు చందం. వివాదాల జోలికి వెళ్లడు. సాహసాలు చేయలేదు. కానీ ఆయన ముఖ్యమంత్రి అయిన పరిస్థితులలో నెగ్గుక రావాలంటే ఆ రెండూ తప్పవు.

తన చాకచక్యంతో కాంగ్రెస్‌ను తన స్వంత పార్టీగా మలచివేశాడు రాజశేఖర్‌రెడ్డి. దానితో అది తమ కుటుంబ ఆస్తి అన్నట్లు భావిస్తున్నాడు ఆయన కుమారుడు జగన్. ముఖ్యమంత్రి పదవి తన హక్కుగా ఎంచి, అందుకోసం ఒత్తిడి తెస్తున్నాడు. వైఎస్ అనుచరులు, అభిమానులు రోశయ్యను ముఖ్యమంత్రిగా గుర్తించడం లేదు, గౌరవించడమూ లేదు. అధికారుల తీరు కూడా అట్లానే వుంది. దానితో పరిపాలన గాడి తప్పి పోతున్నది. దీన్ని చక్కదిద్దాలంటే రోశయ్య సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోక తప్పదు. అధిష్టానం ఆశీస్సులు కూడా అందుకు అనుగుణంగానే వున్నాయి. కానీ ఆయన మాత్రం అడుగు ముందుకు వేయలేకపోతున్నాడు. మరొకప్రక్క వైఎస్ చేపట్టిన అసంఖ్యాకమైన కార్యక్రమాల వల్ల రాష్ట్ర ఖజానా ఒట్టి పోయింది. ప్రజలలో మాత్రం వైఎస్ పథకాల అమలు జరిగి తీరాలన్న ఆకాంక్ష వుంది. దీన్ని నెరవేర్చడానికి కూడా చాలా సాహసం కావాలి. తన అనుభవాన్ని, పరిపాలన పట్ల అవగాహనను, ఆర్థికనైపుణ్యాన్ని రంగరించి ఇటు ప్రజల ఆశలు, అటు కాంగ్రెస్‌వాదుల ఆగడాలను సమర్థంగా ఎదుర్కోగలిగితేనే రోశయ్య పదవికి సార్థకత లభిస్తుంది. ఆంజనేయుడికి ఒకరు చెప్పిన దాకా తన బలం తనకు తెలియనట్లు, రోశయ్యకు తన శక్తి సామర్థ్యాలు ఎవరో ఒకరు గుర్తు చేయువలసినట్లు కన్పడుతున్నది. ఆ బిడియం నుంచి, ఆ తొట్రుపాటు నుంచి ఆయన సాధ్యమైనంత త్వరగా బయటపడాలని కోరుకొంటున్నాము.

## జనవాణి

### రోశయ్యను కొనసాగించాలి

హెలికాప్టర్ ప్రమాదంలో డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆకస్మిక మరణం తర్వాత కాంగ్రెస్ అధిష్టానం మంత్రివర్గంలో సీనియర్ కొణిజేటి రోశయ్యను ముఖ్యమంత్రిని చేసింది. కాని ఆయనకు వైఎస్ మంత్రివర్గంలో వుండిన మంత్రులు అమితంగా ఇబ్బందులు పెడుతున్నారు. బలహీన ముఖ్యమంత్రి పీఠంపై కూర్చొనివున్నాడనిపించను ఎత్తులు వేస్తున్నారు. రోశయ్యలా రాష్ట్ర స్థితిగతులు తెలిసిన వ్యక్తి మరొకరు లేరు. నిబద్ధతకు మారుపేరైన రోశయ్యనే ముఖ్యమంత్రిగా కొనసాగిస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రతిష్ఠ పెరుగుతుంది.

పి.అరుణకుమారి, నెల్లూరు

### కరవు మండలాల ప్రకటన సరిలేదు

నెల్లూరు జిల్లాలోని 46 మండలాల్లో 44 మండలాలను కరవు మండలాల జాబితాలో చేర్చి నెల్లూరు రూరల్, రాపూరులను దీనిలో లేకుండా చేశారు. రాపూరు, నెల్లూరు రూరల్ మండలాల్లో తాగునీటి ఎద్దడి ఎక్కువగా వుంది. డెల్టా మండలాలపై ప్రేమ చూపించి మెట్ట మండలాలపై ఈ వివక్షత ఏమిటో? రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాల ఎంపికకు ఖచ్చితమైన శాస్త్రీయ ప్రాతిపదికలేదు. రాష్ట్రంలో కురిసిన వర్షపాతంపై కూడా శాస్త్రీయత కొరవడింది.

పి.సుధీర్, నెల్లూరు

### దేశరాజకీయాలపై వైఎస్ ముద్ర!

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అకాల మృతికి అక్షర నివాళులర్పించడంలో 'జమీన్‌రైతు' తనదైన శైలిలో స్పందించింది. గత రెండు వారాల సంపాదకీయాల్లో వైఎస్ వ్యక్తిత్వ చిత్రణలో సమతుల్యత పాటించింది. వారి వ్యవహారశైలి, దక్షతలను విశ్లేషిస్తూ రాసిన వార్తా కథనాలలో నిజాయితీ కొట్టొచ్చినట్టు కన్పించింది. ఆయన రాజకీయాలలోని మెరుపులు, మరకలను సమదృష్టితో ఆవిష్కరించింది. భావావేశానికి లోనుగాకుండా వివిధ వర్గాల గుండె చప్పుళ్లను కూడా స్పష్టంగా విన్పించింది. దేశ రాజకీయాలపై వైఎస్‌ది అరుదైన ముద్ర.

ఎం.రామ్మూర్తి, విశాఖపట్నం

కొరవ 14వ పేజీలో

## 70 ఏళ్ల క్రితం ఈవారం

29-9-1939
పేజీలు : 16 వెల: అణా

### జిల్లా బోర్డు ఎలక్షన్

కాంగ్రెస్ దిగ్విజయం
40 పోటీ లేకుండా లభ్యపడ్డవి.
6 స్థానాలే చెప్పదగిన పోటీ.

### ధరల హెచ్చుదల

నెల్లూరు బజారులో 25వ తేదీన చంద్రా అండ్ కంపెనీ వారు 100 ట్యాగులను 0-4-0లకు అమ్మగా పొత్తూరు చెంచయ్యశెట్టి గారు 0-8-6లకు అమ్మినాడు; ఈ అత్యధిక ధర విషయమై జిల్లా కలెక్టరు వారికి రిపోర్టు చేయబడింది. 28వ తేదీన జిల్లా కలెక్టరుగారు దీని విషయమై విచారించుటకు బజారుకు తహశిల్‌దారు వారితో గూడా వెళ్లారు. చెంచయ్యశెట్టి గారి అంగడి మూయబడి వుండెను. చంద్రా అండ్‌కో వారి వద్ద రూ 0-4-0 రేటుకు అమ్ముతున్నాడన్న స్టేటుమెంటును కలెక్టరు గారు వ్రాసుకొన్నారు.

### నెల్లూరు టౌన్‌హాలు సినిమా కిచ్చుట!

నెల్లూరులో కీ.శే.రేబాల లక్ష్మీనరసారెడ్డి గారు కట్టించిన టౌన్‌హాలు పబ్లికు ఉపయోగార్థం వుద్దేశింపబడినది. బిల్డింగు మీద కూడా పబ్లికుహాలు అని వున్నది. అలాంటప్పుడు ఏదో ఆదాయం కోసరం ఈ పబ్లికు భవనాన్ని సినిమా పెట్టుకోను అద్దెకు యిచ్చుటవలన పురమునకు ట్రస్టీలు ఘోరమగు అపకారం చేసిన వారగుచున్నారు. కాబట్టి ఈ ప్రయత్నం ట్రస్టీలు విరమించుకొనుట అవసరము.

పౌరమహాశయులందరును ముఖ్యంగా 'లా'ను తలక్రిందులు చేసే న్యాయవాదులందరును ఈ విషయమై వెంటనే తగు చర్యగైకొని సినిమాకు యివ్వకుండనటుల చేయుట అవసరము.

-ఓ.వి

## 50 ఏళ్ల క్రితం ఈవారం

25 - 9 - 1959
పేజీలు: 12 వెల: 0-3-0

### ప్రధాని నెహ్రూ నెల్లూరు రాక

ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తన ఆంధ్ర పర్యటనలో 13-10-59 తేది పగలు 11.15 గంటలకు ప్రత్యేక రైలులో నెల్లూరు దర్గామిట్టలోని కొండాయపాళెం గేటు వద్దకు చేరి, అచ్చటనే ఉపన్యసించి, తిరుగా 11.45 గంటలకు బయలుదేరి తిరుపతి పోయెదరు.

### నెల్లూరు మునిసిపల్ ఎన్నికలు

ఎలక్షన్ ప్రచారం ముమ్మరంగా జరుగుతున్నది. సభలు, సమావేశాలు, గడప గడప త్రొక్కి ఓట్లు అభ్యర్థించడాలు, ఊరేగింపులు సాగుతున్నవి. ఎర్రమట్టి వ్రాతలతో, అభ్యర్థుల పోస్టర్లతో గోడలు నిండిపోయి, సినిమా వారికి గూడా చోటులేకుండా పోయింది. కమ్యూనిస్టులు మాత్రం రోడ్లు గుత్తకు తీసుకున్నారు.

పోలింగు మూడు రోజులున్నా, వార్డులలో వాతావరణం అప్పుడే ఒక స్పష్టమైన రూపం ధరించింది. నాలుగైదు వార్డులలో పోటీలు తీవ్రంగా వున్నవి. తక్కిన వార్డుల వాతావరణం చప్పగా వుంది.

### నెల్లూరు ఎలక్షన్

నిచ్చెనమ్మా తొల్త నీ త్రాడు తెగిపోద్ది,
పాత కూజ కాస్త పగిలిపోద్ది,
భ్రష్టుపట్టి పోద్ది ముష్టి నక్షత్రమ్ము
మళ్లీ, కోడిపుంజు మంది జయము

పరుచూరు రామకోటయ
గిరికి గొడతావు నీవు క్రిందట్లాగే,
విరమించుకోండి, దీంతో
వరిగేదేముంది? దబ్బు వాప్పిప్పిస్తా.

ఆంధ్ర రాజకీయ ఆరామక్షేత్రంలో
ఉక్కుమాసి ఏ.సి యుండు వఱకు
వల్లగాదు మనకు నెల్లూరు పట్నాన్ని
కొల్లగొట్ట తండ్రి! కోపమొద్దు.

-శివారెడ్డి

# నెల్లూరు ముచ్చట్లు

## షార్‌కు ఉప రాష్ట్రపతి

ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ 22వ తేది సాయంత్రం శ్రీహరికోటలో షార్ అంతరిక్ష కేంద్రానికి విచ్చేశారు. 23వ తేది జరిగిన పిఎస్ఎల్‌వి సి-14 రాకెట్ ప్రయోగాన్ని వీక్షించిన ఉప రాష్ట్రపతి ఈ ప్రాజెక్టును విజయవంతం చేసిన శాస్త్రవేత్తలను అభినందించారు. ఉప రాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో ఇస్రో ఛైర్మన్ మాధవన్ నాయర్, షార్ డైరక్టర్ చంద్రదత్తన్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మోపిదేవి వెంకటరమణ, ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రామ్‌గోపాల్, ఎస్పీ మల్లారెడ్డి తదితరులున్నారు.

## నెల్లూరులో ఎర్రదండు

వ్యవసాయ కార్మిక సంఘం వజ్రోత్సవ సభను పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన సిపిఎం కార్యకర్తలతో 22వ తేది నెల్లూరు ఎర్రబారింది. కనకమహల్ సెంటర్‌లోని సుందరయ్య విగ్రహం నుంచి విఆర్‌సి వరకు వ్యవసాయ కార్మిక సంఘంలోని సభ్యులు నిర్వహించిన ర్యాలీ చూపరులను ఆకట్టుకొంది. ముందుగా ప్రకటించినట్లు త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ఈ సభకు రాకపోయినా సిపిఎం పార్టీ జాతీయ కార్యదర్శి ప్రకాష్‌కారత్, తెలంగాణా పోరాటయోధురాలు మల్లు స్వరాజ్యం, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పాటూరు రామయ్య, మాజీ ఎమ్పీ మిరియం బాబూరావు, ఆ పార్టీ నెల్లూరు నేతలు జక్కా వెంకయ్య, టి.పి.భానురాజు తదితరులు హాజరయ్యారు.

## ఎస్పీకి ఛార్జి మెమో

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అంత్యక్రియల సందర్భంగా వేంపల్లె జంక్షన్ ట్రాఫిక్ నియంత్రణ విధుల్లో ఎందుకు విఫలమయ్యారంటూ ఎస్పీ మల్లారెడ్డికి డిజిపి ఛార్జి మెమో జారీ చేశారు. రాయలసీమ రేంజ్ ఐజి ఠాకూర్, కడప ఎస్పీ చౌహాన్‌లకూ ఈ ఛార్జిమెమోలు జారీ అయ్యాయి.

## వివేకాను పట్టించుకోని ముస్లింలు!

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే వేసే వేషాలను ప్రజలు పట్టించుకోవడం మానేస్తున్నారన్న విషయం రంజాన్ వేడుకల్లో స్పష్టమయ్యింది. 21వ తేది ఈద్గా మైదానంలో రంజాన్ నమాజ్ ముగిసిన తర్వాత ముస్లింలకు శుభాకాంక్షలు చెప్పే సాకుతో ఉపన్యాసం మొదలుబెట్టారు వివేకానందరెడ్డి. యూనివర్శిటీ పరిపాలన భవనం సౌలభ్యం కోసం సిమెంటు రోడ్డు వేస్తూ ఈద్గా కోసం రోడ్డు వేస్తున్నట్లు పచ్చి అబద్ధాలకు మళ్లుకొన్నారు. పండుగ పూట వీటిని వినలేక ముస్లింలు లేచి వెళ్లిపోనారంభించారు. రెండు నిమిషాలైనా తన మాటలు వినమని ఎమ్మెల్యే అభ్యర్థించినా ఎవరూ వినకుండా వెళ్లిపోయారు. ఈ పరిణామానికి కలెక్టర్, ఎస్పీలతోపాటు వివేకానందరెడ్డి వెనుక వుండే నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డిలు కంగుతిన్నారు.

## మరుభూమిపై హైకోర్టులో వ్యాజ్యం!

ఇటీవల ముఖ్యమంత్రితోపాటు హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ సుబ్రహ్మణ్యంను ఖననం చేసిన చెముదుగుంట గ్రామపరిధిలోనికి వచ్చే భూమి విషయమై బురాన్‌పూర్ గ్రామానికి చెందిన రంగయ్య హైకోర్టులో వ్యాజ్యం వేశారు. 1983లో అధికారులు నిరుపేదనైన తనకు 2.44 ఎకరాల భూమి ఇచ్చారని, దీనికి పట్టాదారు పాసుపుస్తకాలు కూడా వున్నాయని మొత్తుకున్నా అధికారులు వినకుండా తన భూమిలో సుబ్రహ్మణ్యం సమాధి కట్టేశారని హైకోర్టుకు విన్నవించాడు. ప్రస్తుతం ఈ భూమి విలువ ఎకరం కోటి రూపాయలు పలుకుతుందని రంగయ్య తన ఫిర్యాదులో స్పష్టం చేశారు. నెల్లూరు కలెక్టర్, ఆర్డీఓ, వెంకటాచలసత్రం ఎమ్మార్వో దీనికి కారకులని పేర్కొన్నాడు. ఈ భూమి కేటాయింపులో జిల్లా అధికారులపై విపరీతమైన ఒత్తిడి రావడం వల్ల కేటాయించక తప్పలేదు. ఈ వివాదం ఏ మలుపులు తిరుగుతుందన్నది వేచి చూడక తప్పదు.

## యాసిడ్ గోడౌన్లపై దాడులు

నెల్లూరు నగరంలోని బోడిగాడి తోటలోని వెంకటసాయి ఏజెన్సీ, బాలాజీ ఏజెన్సీలపై డిఎస్పీ రాధికారెడ్డి దాడిచేసి 30వేల లీటర్ల యాసిడ్‌ను స్వాధీనం చేసుకొన్నారు. పోలీసులు స్వాధీనం చేసుకొన్న వాటిలో నైట్రిక్, సల్ఫ్యూరిక్, హైడ్రోక్లోరిక్ యాసిడ్లున్నాయి. మహిళలపై విపరీతంగా జరుగుతున్న యాసిడ్ దాడుల నేపథ్యంలో నియంత్రణ లేకుండా వ్యాపారం జరుగుతున్న నెల్లూరులోని యాసిడ్ గోడౌన్లపై పోలీసులు దాడులకు పూనుకొన్నారు.

## బాలాజీ మొబైల్ మల్టీబ్రాండెడ్ షోరూం

ప్రజల్లో విశ్వసనీయత, చక్కని వ్యాపారదక్షతతో ముందుకు సాగిపోతున్న బాలాజీ గ్రూప్ నెల్లూరులో తన ఆరవ షోరూంను ఎసి సెంటర్‌లో 21వ తేది ప్రారంభించింది. బాలాజీ మొబైల్ మల్టీ బ్రాండెడ్ షోరూం పేరిట పెట్టిన దీన్ని నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యేలు ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, ఆనం వివేకానందరెడ్డి కలసి ప్రారంభించారు. మేయర్ భానుశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాలాజీ గ్రూప్ మేనేజింగ్ డైరక్టర్ బాలాజీ చౌదరి 1990లో నెల్లూరు ట్రంకురోడ్డులో మొదటి షోరూంను ప్రారంభించిన వేళా విశేషం రాష్ట్రవ్యాప్తంగా 60 బ్రాంచీలకు ఆయన వ్యాపారసామ్రాజ్యం విస్తరించింది. 1800 మంది ఉద్యోగులు ఈ సంస్థలో నేడు పనిచేస్తున్నారు. నేటితరం యువకులు కోరుకునే అన్ని మాడళ్లు, అందుబాటు ధరలకు అమ్మి బాలాజీ చౌదరి జనం నమ్మకం చూరగొన్నారనాలి.

## చెన్నై - నెల్లూరుల మధ్య మరో మెమూ

నెల్లూరు - చెన్నైల మధ్య జనవరి నెల నుంచి మరో మెమూ రైలు నడుస్తుందని తిరుపతి ఎమ్పీ చింతా మోహన్ చెప్పారు. ఇప్పుడు నడుస్తున్న రెండు మెమూ రైళ్లకు ఛార్జి తక్కువ కావడం, వేళకు గమ్యం చేరుస్తుండడంతో విపరీతమైన డిమాండ్ వుంది.



తిరుపతిలోని చదలవాడ ట్రస్ట్ తరఫున ఉత్తమ ఉపాధ్యాయునిగా నెల్లూరీయుడు రామారావుకు అవార్డును అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకురాలు చదలవాడ సుచరిత.

## రైతులకు రుణాలు

జిల్లాలోని 44 మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిన నేపథ్యంలో రైతులను ఆదుకొనేందుకు 440 కోట్ల మేర రుణాలివ్వనున్నారు. దీనికిగాను లక్షా 20వేల మంది రైతులను ఎంపిక చేయనున్నారు.

## రోశయ్యను కలసిన ఆర్యవైశ్య నేతలు

ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన కొణిజేటి రోశయ్యను నెల్లూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘం నేతలు కలసి అభినందించారు. వీరిలో సంఘం అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, కార్యదర్శి కాకరపర్తి జగన్‌మోహన్‌రావు, వాసవీ సేవాదళ్ అధ్యక్షులు కొండపల్లి సురేష్‌బాబు తదితరులున్నారు.

## స్వైన్‌ఫ్లూ మందుల పంపిణీ

నెల్లూరులోని జూనియర్ ఎన్టీఆర్ సామాజిక సేవాసమితి ఎన్టీఆర్ నగర్‌లో స్వైన్‌ఫ్లూ రాకుండా ఉచితంగా హోమియో మందులను పంచి పెట్టింది. సేవాసమితి అధ్యక్షుడు సింగంశెట్టి రవిచంద్ర నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది.

## ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్

నెల్లూరు సిటీ ఫోటో, వీడియో అండ్ మిక్సింగ్ యూనిట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక 18వ తేది టౌన్‌హాల్‌లో జరిగింది. అధ్యక్షునిగా బి.మారుతీరావు, ఉపాధ్యక్షులుగా ఎం.డి.చౌదరి, రాజా, చంద్రకిరణ్, ఎస్.భాస్కర్, కార్యదర్శిగా బి.భాస్కర్, సహాయ కార్యదర్శులుగా ఎ.హరికృష్ణ, ఎస్.చంద్రశేఖర్, వై.ధ్రువకుమార్, కోశాధికారిగా ఎం.సునీల్‌కుమార్‌లను ఎన్నుకొన్నారు. ఈ ఎన్నికను లయన్ డి.శ్రీధర్‌రావు, రాజగోపాలరెడ్డి పర్యవేక్షించారు.

## జగన్‌ను పరామర్శించిన అరుణమ్మ

నెల్లూరు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పందిళ్లపల్లి అరుణమ్మ 21వ తేది ఇడుపులపాయ వెళ్లారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమాధి వద్ద పుష్పమాల వేసి శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం ఆమె ఇక్కడ బసచేసి వుండిన వైఎస్ జగన్‌ను కలసి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## జీతాలులేని టిడిపి కార్యాలయ సిబ్బంది

జిల్లా తెలుగుదేశం పార్టీ ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నట్లుంది. పార్టీ తరఫున కోటీశ్వరులు ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నా నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది గత ఎనిమిది నెలలుగా జీతాలు లేక అల్లాడుతున్నారు.

## పాపం పసివాడు!

వైద్యుల నిర్లక్ష్యం ఓ పసివాడి ప్రాణం బలిగొనింది. పొదలకూరు మండలం దేగపూడి గ్రామానికి చెందిన వేణును తేలుకుట్టగా అతని తల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లింది. ఇక్కడి వైద్యుడు నెల్లూరు పెద్దాసుపత్రికి తీసుకెళ్లమన్నాడు. పెద్దాసుపత్రిలో వైద్యం చేయక రేబాలవారివీధిలోని చిన్నపిల్లల

కొరవ 14వ పేజీలో

**అమ్మకమునకు**

నెల్లూరు సంతపేట నాలుగుకాళ్ళ మండపం ఎదురు వీధిలోగల (శ్రీమాతా కేఫ్ బిల్డింగ్) 6 అంకణముల స్థలంలో కొళాయి, సంపు, డ్రైనేజీ వసతులతో క్రింద, పైన కట్టబడి వున్న న్యూ బిల్డింగ్ (వ్యాపారానికి, ఇంటికి మరియు గోడౌన్స్‌కు) అను వైనది అమ్మకమునకు కలదు. మరియు

Hotel Boiler Equipment

కావలసినవారు ఈ క్రింది నెంబర్‌కు ఫోన్ చేయగలరు.

93467 28104

**బంగారం స్పెషల్ ఆఫర్**

BIS 916 హాల్‌మార్క్
బంగారు ఆభరణములపై
సవరకు రూ.400/- తగ్గింపు.
గ్రాముకు రూ.50/- తగ్గింపు.
డైమండ్స్ పై 10% తగ్గింపు.

**గోల్డ్ ప్యాలెస్**

హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్,
ఆచారివీధి, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611

**అమ్మ ఫర్నిచర్స్**

"A House of Life style furnitures"
గృహాలంకరణకు కావలసిన అత్యాధునిక ఇంపోర్టెడ్ ఫర్నిచర్,
సెల్: 9246435610, 9849495615

**PLOT FOR SALE**

బుజబుజనెల్లూరులో 400 అం॥లు గేటు, గోడలు కలిగి డాక్యుమెంట్స్ క్లియర్‌గా ఉన్న తూర్పు ఫేసింగ్ కల్గిన ప్లాటు అమ్మబడును.

Cont: 98854 08359

## • కొత్త మార్గదర్శకాలతోనైనా

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మార్పు?

**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకానికి నిధుల కొరతలేకున్నా పనులు మాత్రం ఆశించినంత మేర జరగడం లేదు. నూతన మార్గదర్శకాలైనా ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తాయేమో చూడాలి.**

రాష్ట్రంలో ఇందిరమ్మ పేరుతో గృహ నిర్మాణ పథకం ప్రారంభించి ఐదు సంవత్సరాలు పూర్తయ్యింది. గడచిన ఈ ఐదు సంవత్సరాల కాలంలో గృహనిర్మాణంలో అనేక అవినీతి, అక్రమాలు చోటుచేసుకొన్నాయి. లబ్ధిదారులను ఎంపిక చేయడం దగ్గర నుంచి నిర్మాణం చేపట్టి బిల్లులు చెల్లించే వరకు అధికారులు, సిబ్బంది అవకతవకలకు పాల్పడిన సంఘటనలు లేకపోలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకానికి కొన్ని ప్రాంతాల్లో అధికార్లు తూట్లు పొడిచారు. దీంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇబ్బందులు ప్రారంభమయ్యాయి.

ఇందిరమ్మ పేరు పెట్టక ముందు గ్రామీణ ప్రాంతాల్లోగానీ, పట్టణ ప్రాంతాల్లోగానీ పక్కాగృహాలు ఎమ్మెల్యే కోటాలో మంజూరు కాబడేవి. పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారుని పేరిట సంబంధిత ఏరియా బ్యాంకుల్లో ఖాతా ప్రారంభించి పక్కా గృహ నిర్మాణానికి సంబంధించిన బిల్లు తాలుకు నగదును గృహనిర్మాణ శాఖ అధికారులు అందులో జమ చేసేవారు. ఎమ్మెల్యే కోటాలో పక్కా గృహాలు కొన్ని గ్రామాలకే పరిమితం అవుతుండేవి. దీంతో పెద్దగా అవినీతి, అక్రమాలు జరిగేవి కావు. 2006 సంవత్సరం నుంచి ఎమ్మెల్యే కోటాకు స్వస్తి పలికి నివేశన స్థలాలు కేటాయించి, పక్కా గృహాల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

గృహ నిర్మాణాల బిల్లుల మంజూరులో కఠిన నిబంధనలను ప్రభుత్వం జారీచేయకపోవడంతో అవినీతి, అక్రమాలు చోటుచేసుకునేందుకు అవకాశం ఏర్పడింది. లబ్ధిదారుని పేరిట బ్యాంకులో ఖాతా ప్రారంభించే విధానానికి స్వస్తి చెప్పి గ్రామ సంఘబంధాల ద్వారా బిల్లులు చెల్లించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పక్కా గృహాల నిర్మాణం పూర్తయిన తర్వాత పరిశీలన జరిపి లబ్ధిదారులకు చెల్లించాల్సిన నగదును సంఘబంధాలకు చెందిన బ్యాంకు ఖాతాలో అధికారులు జమచేస్తే ఆ నగదును సంఘబంధం లీడర్లు డ్రాచేసి గ్రామంలోని లబ్ధిదారులకు అందజేసే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను కొంతమంది సంఘబంధం లీడర్లు అలుసుగా తీసుకుని నగదు స్వాహాకు పాల్పడిన సంఘటనలు కూడా వున్నాయి.

### కొత్త ఉత్తర్వులు

బ్యాంకు ఖాతాలలో లబ్ధిదారులకు ఇబ్బంది వుంటున్నదని సంఘబంధాలకు బాధ్యతలు అప్పగిస్తే లక్షలాది రూపాయల నగదు దుర్వినియోగం జరిగింది. ఇటువంటి సంఘటనలు జిల్లావ్యాప్తంగా జరిగిన విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో ప్రభుత్వం స్పందించి ఈ విధానాన్ని రద్దుచేసి పాత విధానాన్ని తిరిగి కొనసాగించాలని ఇటీవల జిల్లా అధికారులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటికే జిల్లాలో మూడు విడతలుగా గ్రామాలలో రెండు లక్షల 40వేల 758, పట్టణ ప్రాంతాలలో 47వేల 548 పక్కాగృహాలు మంజూరై వున్నాయి. వీటిలో తొలివిడత 77,871, రెండవ విడత 89,581, మూడవ విడత 73,306 ఇళ్లు వున్నాయి.

అలాగే జిల్లాలో నాలుగు మునిసిపాల్టీల పరిధిలో తొలివిడత 10,922, రెండవ విడత 15, 722, మూడవ విడత 20,904 పక్కా గృహాలు మంజూరు చేశారు. తొలివిడత మంజూరు చేసిన 77,871 గృహాలలో పూర్తయినవి 43,266. వివిధ దశలలో వున్నవి 23,953. అసలు పనులు ప్రారంభంకానివి 10,652. రెండవ విడతలో 89,581 ఇళ్లు మంజూరైతే వీటిలో 20,992 పూర్తిచేశారు. 27,940 ఇళ్ల వివిధదశలలో నిర్మాణంలో వున్నాయి. నిర్మాణానికి నోచుకోనివి 40,649 వున్నాయి. మూడవ విడతలో 73,306 ఇళ్లు మంజూరు చేస్తే అవి ఇంకా రూఫ్‌లెవల్‌కు కూడా నోచుకోలేదు.



కనుపర్తిపాడులో నత్తనడకన కడుతున్న ఇందిరమ్మ ఇళ్లు.

### పట్టణాల్లో నత్తనడత

పట్టణ ప్రాంతాల్లో తొలివిడతలో 10,922 ఇళ్లు మంజూరుకాగా వీటిలో కేవలం 922 ఇళ్లు పూర్తి చేశారు. 1,102 ఇళ్లు వివిధ దశలలో నిర్మాణంలో వుండగా 8,898 ఇళ్లు పునాదులు దాటని పరిస్థితిలో వున్నాయి. రెండవ విడతలో 15,722 ఇళ్లు కేటాయించగా వీటిలో 671 ఇళ్లు పూర్తి చేయడం జరిగింది. 585 ఇళ్లు నిర్మాణదశలో వున్నాయి. 14,466 ఇళ్లు అసలు ప్రారంభం కాలేదు. మూడవ విడతలో మంజూరు కాబడిన 20,904 ఇళ్ల గురించి పట్టించుకునే దిక్కులేకుండా పోయారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తుంది. ప్రజాప్రతినిధులు వీటిపై దృష్టి సారించి పర్యవేక్షించక పోవడంతో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి.

సభలు, సమావేశాలలో మాత్రం ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ గృహనిర్మాణ పథకంపై ఉపన్యాసాలు చేస్తూ తెగ అదరగొడతారు. ఒక్క గ్రామానికైనా వెళ్లి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఎలా జరుగుతుంది, లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో అందుతున్నాయా? లేదా? అన్న విషయంపై ఆరాతీసిన దాఖలాల్లేవు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసే విషయంలో పొరపాటున ఆహ్వానపత్రికల్లో పేర్లు ముద్రించకుంటే నానా రభస చేస్తుంటారు మన ప్రజాప్రతినిధులు. ఇళ్ల నిర్మాణాలను తనిఖీలు చేయకపోవడమే కాకుండా కొన్ని ప్రాంతాలలో అవకతవకలకు పాల్పడిన సిబ్బందిని వెనకేసుకొస్తున్న సంఘటనలు వున్నాయి.

### జిఎంను ప్రక్కతోవ పట్టించారు!

ఇటీవల రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ చీఫ్ జనరల్ మేనేజర్ జగదీష్‌బాబు జిల్లాలో పర్యటించి పక్కా గృహాలను పరిశీలించడం జరిగింది. అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్న గ్రామాలకు మాత్రం జనరల్ మేనేజర్‌ను తీసుకెళ్లితే ఎక్కడ వాస్తవాలు వెలుగు చూస్తాయోనన్న భయంతో గృహ నిర్మాణ శాఖాధికారులు ముందుగా తగిన జాగ్రత్తలు తీసుకుని ఎటువంటి ఇబ్బందిలేని గ్రామాలలో పర్యటింపచేయడంలో సఫలీకృతులయ్యారు. పక్కా గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు సమీపంలోని బ్యాంకుల్లో ఖాతా ప్రారంభించాలని ఆయన కోరారు. తొలి, రెండవ, మూడవ విడతలలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులందరికీ కూడా ఇక నుంచి బ్యాంకుల్లో బిల్లుల తాలుకా నగదు జమ చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు.

కొత్త మార్గదర్శకాల ప్రకారం మండలం, గ్రామస్థాయిల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు నూతన కమిటీలను ఏర్పాటుచేయాల్సి వుంటుంది. అయితే కమిటీల ఏర్పాటుపై ఇప్పటికే కొన్ని గ్రామాలలో రాజకీయ విభేదాలు తలెత్తుతున్నాయి. గ్రామసభలు నిర్వహించి గ్రామస్తుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని కమిటీల ఏర్పాటు జరగాలని ప్రభుత్వ సంకల్పం. గ్రామస్తుల సహకారం లేకుండానే పంచాయితీ పరిధిలోని అధికారపార్టీ నేతలు సూచించిన వ్యక్తులనే కమిటీలో సభ్యులుగా నియమిస్తున్నారు అధికారులు. జిల్లాలోని మూడు రెవిన్యూ డివిజన్లు, 46 మండలాల్లో 961 గ్రామపంచాయితీలలో ఇందిరమ్మ గృహనిర్మాణ పథకం అమలు జరుగుతోంది.

కొరవ 14వ పేజీలో

#### పట్టించుకోవడం లేదు!



ఇందిరమ్మ పథకం ద్వారా మంజూరు చేసిన పక్కాగృహాల నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయినా పట్టించుకునేవారు లేకుండా పోయారు. ఇల్లు మంజూరు చేసిన అధికారులు తర్వాత బిల్లుల చెల్లింపు, సిమెంటు సరఫరా చేయడం లేదు. అసలు ఇళ్లు పూర్తి చేస్తారా? లేదా? అన్నది కూడా సందేహం కలుగుతున్నది.

***భాగ్యమ్మ, కనుపర్తిపాడు***

#### పునాదులకే పరిమితం!



ఇందిరమ్మ పథకం ద్వారా మంజూరు చేసిన ఇల్లు పునాదులకే పరిమితమై వుంది. గృహ నిర్మాణ శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. పక్కా గృహం కోసం వున్న పూరిగుడిసెను కూడా తీసేసి ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి త్వరితగతిన ఇంటి నిర్మాణం చేపట్టాలి.

***భవాని, కనుపర్తిపాడు***

#### అధికారుల నిర్లక్ష్యం!



ఇందిరమ్మ పథకం ద్వారా మంజూరు చేసిన పక్కా గృహాల నిర్మాణ విషయంలో గృహనిర్మాణ శాఖ అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం ఒక ప్రక్క ఇందిరమ్మ ఇళ్లకు నిధులు మంజూరుచేసి పూర్తి చేయాలని హెచ్చరిస్తున్నా ఇక్కడ అధికారులలో స్పందన రాకపోవడం బాధాకరంగా వుంది.

***శ్యాంసుందర్, కనుపర్తిపాడు***

# సబ్సిడీపై విత్తనాలు

**ఉద్యానవన శాఖాధికారి వెల్లడి**

సన్న చిన్నకారు రైతులకు ఆర్థికంగా చేయూతనందించేందుకు 75శాతం సబ్సిడీతో హైబ్రీడ్ కూరగాయల విత్తనాలను అందించనున్నట్లు ఇందుకూరుపేట మండల ఉద్యానవన శాఖాధికారి సిహెచ్.శ్రీనివాసులు తెలిపారు. రైతులు ఆర్థికంగా బలపడేందుకు 2009-10 సంవత్సరానికి ఈ నిర్ణయం తీసుకొన్నట్లు చెప్పారు. మండలంలోని పాములవారిపాళెం, టివి కండ్రిగ, కాలువగట్టు, జగదేవిపేట, లేబూరు, పల్లెపాడు, దేవిస్‌పేట, వడ్డిపాళెం గ్రామాల్లో ఎక్కువగా కూరగాయలు సాగవుతున్నాయన్నారు. ఈ గ్రామాల్లోని రైతులకు బెండ, చిక్కుడు, దోస, కాకర, బీర, వంగ, క్యారెట్, కాలిఫ్లవర్, ఉల్లి, తదితర కూరగాయలకు సంబంధించిన హైబ్రీడ్ విత్తనాలను 75శాతం సబ్సిడీతో తక్షణం సరఫరా చేస్తామన్నారు. తీగ జాతికి చెందిన పందిరి చిక్కుళ్లు, పొట్ల, గుమ్మడి, బీర పండించే రైతులకు పందిళ్లు వేసుకొనేందుకు ఒక్కో ఎకరాకు రాళ్లపందిరి వేసుకొంటే 60వేల రూపాయలు, కర్రలతో వేసుకొంటే 30వేలు సబ్సిడీ ఇస్తామన్నారు. దీని ప్రకారం రైతులకు 1200 రూపాయల విలువైన విత్తనాలు 300 రూపాయలకే అందుతాయని దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ముందు సమస్యలు పరిష్కరించండి!

గ్రామసమస్యలు అధికారులకు పలుమార్లు విన్నవించినా పరిష్కారం కాలేదు. అలాంటప్పుడు కొత్తగా గ్రామదర్శిని పేరుతో సమావేశాలు నిర్వహించడం ఎందుకని ఉత్తమ నెల్లూరు సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడైన జంగిటి కృష్ణయ్య నిలదీశారు. గ్రామానికి వచ్చిన అధికారులను ఆయన పలు అంశాలపై నిలదీయడంతో వారు కిక్కురుమనలేదు. పంచాయితీ అభివృద్ధికి ఎలాంటి నిధులు మంజూరు చేయడం లేదని, గ్రామ సమస్యలు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆవేదన నిండిన స్వరంతో అధికారుల ముందు వాపోయాడు. తమ గ్రామానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరై రెండు సంవత్సరాలు గడుస్తున్నా బిగించలేదని, పంచాయితీ పరిధిలో అనేక బోర్లు మరమ్మత్తులకు గురౌతున్నా ఏ అధికారి పట్టించుకోవడం లేదని ఆరోపించాడు. పింఛన్లు అందడంలేదని అధికారుల తీరును తూర్పారా బట్టాడు. దీంతో దిక్కుతోచక నోటమాటరాని అధికారులు తేలుకుట్టిన దొంగల్లా గమ్మునుండిపోయారు.

# జెండాదిబ్బలో భూకబ్జా

సంగం మండలం జెండాదిబ్బ గ్రామంలో 50 లక్షల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. బుచ్చిరెడ్డిపాళానికి చెందిన వ్యక్తులు 1975లో సర్వే నెంబరు 12-1లో 0.84 సెంట్లు 12-3లో 2.26 సెంట్లు ఆక్రమించుకున్నారు. ప్రస్తుతం ఈ భూమి విలువ 50 లక్షలుగా వుంది. ఈ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లస్థలాల కోసం 92 మంది లబ్ధిదార్లు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నా స్థలాలు లేక ఇండ్ల నిర్మాణం ఆగిపోయి ఉంది. ప్రభుత్వం ఈ భూమిని స్వాధీనం చేసుకొని కొంతమందికైనా న్యాయంచేస్తే మంచిదన్న అభిప్రాయాన్ని గ్రామస్తులు వ్యక్తపరుస్తున్నారు.

# మండల కార్యాలయం ముట్టడి

వెంకటాచలం మండలం తెలుగుదేశం పార్టీ నేత ప్రదీప్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో 200 మంది కార్యకర్తలు మండల పరిషత్ కార్యాలయంలో ఆందోళన నిర్వహించారు. అనికేపల్లి మాజీసర్పంచ్ నిధులు దుర్వినియోగం చేశాడని, రాజకీయ నాయకుల అండతో విచారణ చేయకుండా సర్పంచును కాపాడుతున్నారని వారు ఎంపిడిఓ హేమలతకు వినతి పత్రం ఇచ్చారు. ఈ ఆందోళనలో మండల నేతలు రామిరెడ్డి భాస్కర్‌రెడ్డి, టాట్ల వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


శ్రీ లలితాంబికాదేవి మణిద్వీప మహా సంస్థానము



నవరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వానం - 2009

సెప్టెంబరు 19 నుంచి 28 వరకు



నవరాత్రులలో అపూర్వ నిత్య అభిషేకాలు

సెప్టెంబరు 20 నుంచి 28 వరకు

ప్రతి ఉదయం 5-00 నుండి 8-00 వరకు
సుప్రభాత సేవ, శ్రీగణేశ, శ్రీ సుబ్రమణ్య, శ్రీమహాలక్ష్మి శ్రీ మహాసరస్వతీ, శ్రీ లలితాంబికాదేవి, మహాభిషేకాలు రుద్రాభిషేకాలు, శ్రీ చక్రానికి సప్త సూక్త అభిషేకం. అలంకారం, అర్చన, సుప్రభాత సేవానంతర మహాహారతి తీర్థప్రసాద వినియోగం.

ప్రతి రోజు సాయంత్రం 5-30 నుండి 9-00 వరకు
సామూహిక శ్రీ లలితా సహస్రనామ కుంకుమార్చన, సంకీర్తనలు, శ్రీలలితాంబికాదేవి పల్లకీ సేవలు. వాహన సేవలు, కమలార్చనలు, సహస్ర జ్యోతుల మహామంగళ హారతులు, ప్రత్యేక ఉయ్యాల సేవలు వేదాశీస్సులు, ప్రసాద వినియోగం.

నవరాత్రి ప్రతి నిత్యం
మహాశక్తివంతమైన హోమాలు
సెప్టెంబరు 20 నుంచి 28 వరకు
సమయం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.45 వరకు

శ్రీ మహాగణేశ సహస్ర మోదుక హోమం,
శ్రీ నవగ్రహశాంతి హోమము
శ్రీ గాయత్రిహోమము, శ్రీ సంపుటిత శ్రీసూక్త హోమము,
శ్రీ నారాయణ హోమము, శ్రీ రుద్ర హోమము
శ్రీ లలితా సహస్రనామ కమలాల హోమము.

26 దుర్గాష్టమి మహాష్టమి శ్రీ దుర్గాపూజ శ్రీ చండీ హోమము ◆ 27 మహానవమి శ్రీ చండీ హోమము ◆ 28 విజయదశమి శత చండీ హోమము. దుర్గాష్టమి, మహార్నవమి, విజయదశమి ప్రత్యేకంగా, కేవలం శ్రీ చండీ హోమాలు విశేషంగా జరుగును.

**విజయదశమి కరుణామయి అమ్మ జన్మదినోత్సవము**

విజయదశమి రోజున శ్రీ కరుణామయి అమ్మ ప్రత్యేకమైన దీవెనలు పొంది తరించండి.

**శ్రీ మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమము**

ఇంటర్‌నేషనల్ హెడ్ క్వార్టర్స్ : శ్రీ పెనుశిల క్షేత్రం - 524 414, నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా. WWW. karunamayi.org





**శ్రీ షిరిడి సాయిబాబా వారి మహాసమాధి విజయదశమి మహోత్సవములు**

-: 28-9-2009 సోమవారం నుండి 30-9-2009 బుధవారం వరకు :-

నెల్లూరు ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ వద్ద గల శ్రీ షిరిడి సాయిబాబా మందిరం నందు తేది 28-9-2009 సోమవారం నుండి తేది 30-9-2009 బుధవారం వరకు ప్రతిరోజూ ఉ.7.00గం॥ల నుండి శ్రీ బాబా వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, సహస్రనామ పూజలు చేయబడును. పై పూజలలో పాల్గొను భక్తులు మందిర గుమస్తా వద్ద రూ 75/- చెల్లించి రశీదు పొంది పై పూజలలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించి బాబావారి కృపకు పాత్రులగుదురని ఆశిస్తున్నాము.

గమనిక: పై దినములలో ప్రతిరోజూ షిరిడి హారతులు వుంటాయి.
ప్రతి రోజు సాయంత్రం 7 గం॥ల నుండి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

కార్యవర్గము **శ్రీ షిరిడి సాయిబాబా మందిరము**

గాంధీనగర్, ట్రంకురోడ్డు, నెల్లూరు -524001. ఫోన్ : 0861 - 2327771

## 'వరస' మారింది



నిన్న మొన్నటి వరకు జగన్‌ను సిఎం చేయాల్సిందేనంటూ పట్టుబట్టి నానా యాగీచేసిన మంత్రులు రఘువీరారెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, బొత్సా సత్యనారాయణ ఇప్పుడు స్వరం మార్చారు. ముఖ్యమంత్రిగా జగన్, రోశయ్యలు యిద్దరూ సమర్థులేనని మాట మార్చారు. ఈ ముగ్గురు మంత్రులు కొంతకాలంగా రోశయ్యకు సహాయ నిరాకరణ చేస్తున్నారు. ఈ విషయాన్ని వేగుల ద్వారా తెలుసుకున్న అధిష్టానం వీరప్ప మొయిలీ ద్వారా హెచ్చరికలు పంపింది. దీంతో వీరు ముగ్గురూ కలిసి ప్రత్యేకంగా విలేకరుల సమావేశం పెట్టి మరీ రోశయ్యకు మద్దతు ప్రకటించారు. వీళ్ల ధోరణి చూసిన యితర మంత్రులు మొత్తానికి 'వరస' మారిందంటూ చెవులు కొరుక్కొంటున్నారు.

## సిఎం పదవిపై తకరారు




రోశయ్య సిఎం కావడం చట్ట వ్యతిరేకమంటూ గుంటూరు జిల్లాకు చెందిన ఆడె రవి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశాడు. రాజ్యాంగం ప్రకారం సిఎల్పీ ఎన్నుకున్నవారే సిఎం కావాలని వుండగా రోశయ్యను అధిష్టానం నియమించిందని, యిది చెల్లదంటూ ఆ వ్యాజ్యంలో పేర్కొన్నాడు. యిప్పటి దాకా కాంగ్రెస్ వర్గాల నుంచి; మంత్రుల నుంచి సరైన సహాయ సహకారాలు అందక యిబ్బంది పడ్తున్న రోశయ్యకు పులిమీద పుట్రలా యిప్పుడీ ప్రజావ్యాజ్యం కొత్త సమస్యను తెచ్చి పెడుతుందేమోనని గాంధీభవన్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

## నోరు విప్పిన 'బాబు'



వైఎస్ మరణం తర్వాత రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు మానుకున్న చంద్రబాబు ఆలస్యంగానైనా నోరు విప్పారు. రాష్ట్రంలో కరవు మండలాల్ని ప్రకటించినప్పటికీ సహాయక చర్యలు చేపట్టడం లేదని, మరో పక్క స్వైన్‌ఫ్లూ, విష జ్వరాలు విజృంభిస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదంటూ ప్రభుత్వంపై విరుచుకుపడ్డాడు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి పదవి కోసం కాంగ్రెస్‌వర్గాలు కాట్లాడుకోవడానికే సరిపోతోందని, ప్రభుత్వం గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదంటూ అగ్గిమీద గుగ్గిలమయ్యాడు. ప్రభుత్వం పట్టించుకోకపోయినా తెలుగుదేశం శ్రేణులు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాయని చెబుతున్నాడు. ప్రభుత్వంపై మౌనం వహించడం పార్టీకి మంచిదికాదంటూ వచ్చిన సూచనలకు బాబు నోరు విప్పాడని అంటున్నారు.

## కెకెకు శృంగభంగం



కాంగ్రెస్‌లో మేధావిగా తనను తాను ప్రచారం చేసుకునే రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావుకు శృంగభంగం ఎదురైంది. వైఎస్ తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిపై కన్నేసివున్న కెకె తన ప్రయత్నాల్లో భాగంగా హైదరాబాదులోని వెంకటస్వామి, నేదురుమల్లి జనార్ధన రెడ్డి వంటివారిని కలుసుకొని మద్దతు కోరాడు. పనిలో పనిగా జగన్‌కు ఢిల్లీలో అనుకూలంగా లేదంటూ మీడియాలో వ్యాఖ్యానాలు చేశాడు. దీంతో రెచ్చిపోయిన జగన్ అభిమానులు కెకెపై ఎదురుదాడికి దిగారు. అంబటి రాంబాబు వంటి జగన్ వీరవిధేయులు కెకెను తీవ్రంగా మందలించారు. జరిగిన తప్పిదాన్ని తెలుసుకున్న కెకె నాలుక కరుచుకొని కలకత్తాకు చెక్కేశాడు. సిఎం పదవిపై ఎంత ఆశవున్నా యిలా పబ్లిగ్గా రోడ్డుమీద పడితే ఏమవుతుందో కెకెకు తెలిసొచ్చింది.

## ఒత్తిడి ద్వారానే సిఎం పదవి



అధిష్టానంపై ఒత్తిడి తేవడం ద్వారానే సిఎం పదవిని చేజిక్కించుకోవాలని జగన్ భావిస్తున్నాడు. ఢిల్లీలో తన అభ్యర్థిత్వం పట్ల అంతగా స్పందన లేకపోవడంతో జనం ద్వారా ఒత్తిడి తెచ్చి సిఎం కావాలని ఆయన నిర్ణయించుకున్నాడట. ఇందులో భాగంగానే వేలాది మందిని ఇడుపులపాయకు తరలిస్తున్నాడు. ఆ తర్వాత వైఎస్ ప్రమాదానికి గురైన నల్లమల పావురాల గుట్టకు లాంగ్‌మార్చ్‌ను నిర్వహిస్తున్నాడు. వేలాది మంది జనంతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్పీలు, యితర ప్రజాప్రతినిధుల్ని యిందులో పాల్గొనేట్లు కార్యక్రమాన్ని కూడా రూపొందించారు. అయితే ఒత్తిడికి తలొగ్గేది లేదంటూ అధిష్టానం పాతపాటే పాడుతోంది. పాపం జగన్!!

## జగన్‌ను ప్రసన్నం చేసుకొన్న రోజా



కాంగ్రెస్ పార్టీలో చేరడానికి వురవురలాడుతున్న సినీనటి రోజా పనిగట్టుకొని ఇడుపులపాయకు వెళ్లి జగన్‌ను ప్రసన్నం చేసుకుంది. పనిలోపనిగా జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలంటూ ఓ స్టేట్‌మెంట్ కూడా యిచ్చింది. అయితే ఇడుపులపాయకు వెళ్లిన రోజాను పట్టించుకున్నవారే లేరట. సోదరుడ్ని వెంటబెట్టుకొని వెళ్లిన రోజాకు కాంగ్రెస్ వర్గాల నుంచి అంతగా ఆదరణ లభించలేదట. అయితే జగన్‌ను కలిసి మద్దతు ప్రకటించడం మాత్రం గుడ్డిలో మెల్లలా భావిస్తోందట రోజా.

## జగన్ ఆస్తులపై ఇంటెలిజెన్స్ ఆరా



జగన్ ఆస్తులపై కేంద్ర ఇంటెలిజెన్స్ ఆరా తీస్తోందట. గత అయిదేళ్లలో జగన్ స్థాపించిన వివిధ కంపెనీలు, సంస్థలు, పరిశ్రమల షేర్ల విలువ ప్రస్తుతం 78వేల కోట్లకు చేరాయట. షేరు విలువలు యిలా పెరగటానికి గల కారణాల్ని ఇంటెలిజెన్స్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. దీనికి సంబంధించి ప్రాథమిక సమాచారాన్ని యిప్పటికే ఢిల్లీకి అందజేసినట్లు వినికిడి. ఈ సమాచారంతో ఒక రహస్య నోట్‌ను తయారుచేసి ఏఐసిసి పెద్దలకు సర్క్యులేట్ చేశారట. పనిలో పనిగా జగన్‌పై వున్న పాతకేసుల్ని కూడా తిరగదోడి వివరాల్ని సేకరించే కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ తలమునకలై వుందట -ష్... జగన్!

## చిరు - రోశయ్య భాయ్ భాయ్!!



ఉప్పు నిప్పులా వుండే అధికారపక్షం, ప్రతిపక్షం కలిసిపోతే ఎలా వుంటుంది. తిరుపతి బ్రహ్మోత్సవాల సందర్భంగా అచ్చం ఇలాంటి సీన్ జనానికి కనువిందు చేసింది. బ్రహ్మోత్సవాలకు స్వామివారికి పట్టువస్త్రాల్ని పట్టుకెళ్లిన సిఎంకు తిరుపతి ఎమ్మెల్యే చిరంజీవి ఎదురువచ్చారు. ఇద్దరూ కరచాలనం చేసుకున్నారు. పనిలోపనిగా రోశయ్య చిరును పొగిడాడు. చిరు కూడా రోశయ్యను ఆకాశానికి ఎత్తేశాడు. అక్కడ వున్నవారంతా 'క్యాసీన్‌హై' అంటూ తరించిపోయారట.

# 48వ డివిజన్‌లో పారిశుధ్యం అధ్వాన్నం!

నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ పాలకవర్గం ఏర్పడి దాదాపు నాలుగు సంవత్సరాలు పూర్తయ్యింది. ఈ నాలుగు సంవత్సరాల కాలంలో ఇద్దరు మహిళా మేయర్లు బాధ్యతలు చేపట్టారు. కార్పొరేషన్ పాలకవర్గంలోని అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య నిత్యం అభిప్రాయబేధాలు తలెత్తుతున్నాయి. వీటిని ఆసరాగా తీసుకుంటున్న కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది విధులకు డుమ్మాకొడుతూ, నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి మరచిపోతున్నారు. అధికారులు, పాలకవర్గం అవలంభిస్తున్న విధానాల కారణంగా నగరాభివృద్ధి కుంటుపడుతున్నది.

ఇందుకు ఉదాహరణగా 48వ డివిజన్‌ను పేర్కొనవచ్చు. ఈ డివిజన్ కార్పొరేటర్‌గా గతంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ధారా జయరాజ్ గెలుపొందాడు. 2005 సంవత్సరంలో ఈ డివిజన్‌ను ఎస్సీ మహిళకు రిజర్వు చేయడం జరిగింది. దీంతో జయరాజ్ తల్లి ధారా మరియమ్మను తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేయించడంతో ఆమె గెలుపొందడం జరిగింది. కార్పొరేటర్‌గా గెలుపొందిన మరియమ్మ తన కొడుకు సలహామేరకు కాంగ్రెస్ పార్టీలో చేరింది.



**వీధిలైట్లు వేయాలి!**

డివిజన్ ప్రధాన కూడళ్లలో వీధి దీపాలు వెలగక చిమ్మచీకటిగా వుండడంతో రాత్రిళ్లు ఒంటరిగా నడిచి వెళ్లాలంటే భయంగా వుంది. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేదు. ప్రతిరోజు వీధులను శుభ్రంచేసే విధంగా అధికారులు కృషిచేస్తే బాగుంటుంది.

– కాంతమ్మ



**అభివృద్ధి పనులు లేవు**

డివిజన్‌లో పారిశుధ్యం చాలా అధ్వాన్నంగా వుంది. డ్రైనేజి కాల్వలు లేకపోవడం వల్ల మురికి నీరంతా వీధుల్లో ప్రవహిస్తుంది. దీనివల్ల అంటు వ్యాధులు వ్యాపించే అవకాశం వుంది. అధికారులు స్పందించి తగినచర్యలు తీసుకోవాలి.

– సిహెచ్.ప్రవీణ్‌బాబు

వయస్సు మీదపడుతుండడంతో ఆమె డివిజన్‌లో పర్యటించి సమస్యలను ప్రత్యక్షంగా చూసి తెలుసుకోలేక పోతుంది.

48వ డివిజన్ పరిధిలో కపాడిపాళెం, రంగనాయకులపేట కొంతభాగం, అరవపాళెం, అంబేద్కర్ నగర్, బంగారమ్మ గుడి, సంతపేటలోని చేపలమార్కెట్ తదితర ప్రాంతాలున్నాయి. ఈ ప్రాంతాలలో ముఖ్యంగా పారిశుధ్యం, డ్రైనేజి కాల్వలు చాలా అధ్వాన్నంగా వున్నాయి. త్రాగునీటి సరఫరా కూడా సక్రమంగా జరగడం లేదు. ప్రధాన కూడళ్లలో ఏర్పాటుచేసి వున్న వీధిలైట్లు వెలగక పోవడంతో రాత్రి సమయంలో చిమ్మచీకటిగా వుంటుందని ఇక్కడి ప్రజలు వాపోయారు. తెలుగుదేశం పార్టీ నుంచి ఆనం వర్గంలో చేరిన కార్పొరేటర్ డివిజన్ గురించి పట్టించుకోవడం మానేశారు. ఈ డివిజన్‌లో ఎక్కువ సంఖ్యలో పేద ప్రజలు నివాసం వుంటున్నారు. స్వంత ఇళ్లు లేక ఇబ్బంది పడుతున్నా జానెడు నివాసస్థలం ఇప్పించే దిక్కులేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో డివిజన్‌లో జరిగిన అభివృద్ధి పనులు, సమస్యలపై స్థానికులు వెల్లడించిన అభిప్రాయాలను ప్రకటిస్తున్నాం.



మురికి నీళ్లు నిలబడిపోయిన డ్రైనేజి కాల్వ.



రోడ్డు ప్రక్కన చెత్త కుప్ప.

---

**అవినీతి కథ**

# పారిశుధ్య కార్మికుల క్వార్టర్స్ విక్రయం

> కాదేది అమ్మకానికి అనర్హమంటూ కోటమిట్టలోని మునిసిపల్ కార్మికుల కోసం ప్రభుత్వం కట్టించిన క్వార్టర్లను కార్పొరేటర్లు దగ్గరుండి అమ్మిస్తున్నారు.

నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ పాలకవర్గం, అధికారుల నిర్లక్ష్యం, అవినీతి, అక్రమాల కారణంగా కార్పొరేషన్‌కు సంబంధించిన కోట్ల రూపాయలు విలువ చేసే స్థలాలు పారిశుధ్య కార్మికుల కోసం నిర్మించిన క్వార్టర్సు బయట వ్యక్తులకు విక్రయాలు జరిగిపోతున్నాయి. పాలకవర్గంలోని కొందరు కార్పొరేటర్లు కబ్జాలకు, కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం ఇక్కడ చెప్పుకోదగిన విషయం. కోట్ల రూపాయల విలువైన స్థలాలు, క్వార్టర్లను పరిరక్షించాల్సిన అధికార యంత్రాంగం తమకు ఎటువంటి సంబంధం లేదన్న విధంగా వ్యవహరిస్తోంది.

కబ్జాలకు పాల్పడుతున్న అవినీతి అక్రమార్కుల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన పాలకవర్గం వారికి సహాయ సహకారాలు అందిస్తుందన్న ఆరోపణలున్నాయి. పాలకవర్గం, కార్పొరేషన్ అధికారుల వైపు నుంచి ఎటువంటి అభ్యంతరాలు, ఇబ్బందులు లేకపోవడంతో క్వార్టర్లను కొనుగోలు చేసి వ్యాపార భవన సముదాయాలను నిర్మించుకోగలుగుతున్నారు. మునిసిపల్ కార్పొరేషన్‌లో పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్న వారికి నగరంలో కోటమిట్ట సమీపంలో ప్రభుత్వం క్వార్టర్లను నిర్మించడం జరిగింది. దాదాపు వందకు పైగా ఇక్కడ క్వార్టర్లున్నాయి. ఒక్కొక్కరికి 10 అంకణాల స్థలంలో 7 అంకణాల్లో క్వార్టర్లు నిర్మాణం చేపట్టారు.

కార్పొరేషన్ నిబంధనల ప్రకారం పారిశుధ్య కార్మికులు పదవీ విరమణ చేసిన తర్వాత క్వార్టర్స్‌ను ఖాళీచేయాల్సి వుంటుంది. అయితే ఇక్కడ కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతుంది. పదవీ విరమణ చేసిన పారిశుధ్య కార్మికులు క్వార్టర్లు ఖాళీ చేయకపోవడమే కాకుండా ఏకంగా విక్రయించేస్తున్నారు. కొనుగోలు చేసిన రెవెన్యూ అధికారుల నుంచి అన్నిరకాల రికార్డులను తయారు చేయించుకుంటున్నారు. ఒక్కో క్వార్టర్ 3 నుంచి 5 లక్షల రూపాయల వరకు ధర పలుకుతుంది. రెవెన్యూ అధికారులు సైతం పూర్తిస్థాయిలో విచారణ చేపట్టకుండానే అధికారులు, రాజకీయ సిఫార్సులకు తలొగ్గి పట్టాలు జారీ చేసేస్తున్నారు.

పారిశుధ్య కార్మికులు నివాసం వుండే క్వార్టర్లు మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందినవా? కార్మికులకు చెందినవా? అన్న విషయం తెలుసుకోకుండా పొసిషన్ సర్టిఫికేట్లు, పట్టాలను జారీ చేయడం పట్ల ఇందులో రెవెన్యూ అధికారుల ప్రమేయాన్ని అనుమానించాల్సి వుంది. కోటమిట్ట సమీపంలో ఇప్పటికే సగభాగం క్వార్టర్లు ఇతరులకు విక్రయాలు జరిగిపోయాయి. కార్పొరేషన్ పాలకవర్గంలో వుంటూ అధికార పార్టీ నాయకులతో సన్నిహిత సంబంధాలు కలిగిన కార్పొరేటర్ సందాని భాషా అనుచరులు మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన క్వార్టర్లు కొనుగోలు విషయంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. క్వార్టర్లు కొనుగోలు చేసినవారు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి అద్దెకిస్తున్నారు.



అమ్మేసిన మునిసిపల్ పారిశుధ్య కార్మికుల క్వార్టర్ల ప్రక్కన వెలసిన భవనాలు.

కార్పొరేషన్ ఆస్తులు తరిగిపోతున్నా పట్టించుకొనే దిక్కు లేకుండా పోయారు. కార్పొరేషన్‌కు చెందిన క్వార్టర్లను విక్రయించే అధికారం పారిశుధ్య కార్మికులకు లేకపోయినప్పటికి బయట వ్యక్తులు డబ్బు ఆశ చూపి విక్రయించేవిధంగా వారిని వివిధ ప్రలోభాలకు గురి చేస్తున్నారు. నెల్లూరు నగరంలో ఇటీవల కాలంలో భవనాలు, స్థలాలకు భారీ ఎత్తున ధరలు పెరిగిన విషయం అందరికి తెలిసిందే. పారిశుధ్య సిబ్బందిని ప్రలోభాలకు గురిచేసి తక్కువ ధరకు కార్పొరేషన్‌కు చెందిన క్వార్టర్లను కొనుగోలు చేసి అగ్రిమెంటు కూడా చేయించుకొంటున్నారు.

ప్రభుత్వానికి సంబంధించిన క్వార్టర్లను విక్రయిస్తున్న సిబ్బంది, కొనుగోలు చేస్తున్న వారి పైన, వీరికి సహకరిస్తున్న కార్పొరేటర్లు పట్టాలు, పొజిషన్ సర్టిఫికేట్లు జారీచేస్తున్న రెవెన్యూ అధికారులపై ప్రభుత్వం స్పందించి పూర్తిస్థాయిలో విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోకుంటే మరిన్ని ఆస్తులు తరిగిపోయే ప్రమాదం వుంది.

# గాలికి వదిలేసిన ట్రాఫిక్



## గాడిలో పెట్టేదెవరు?

నెల్లూరు నగరంలో ట్రాఫిక్‌ను పోలీసులు గాలికి వదిలేశారు. దీంతో నగరంలోని రోడ్ల మీద వాహనాలు ఇష్టమొచ్చినట్లు తిరిగేస్తున్నాయి. తరచూ ట్రాఫిక్ నిలిచిపోతూ జనం నానాపాట్లు పడాల్సి వస్తుంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించను నగరంలో ఒక సిఐ, ఆరు మంది ఎస్‌ఐలు, 40 మంది కానిస్టేబుళ్లు, అంతే సంఖ్యలో హోమ్‌గార్డులున్నారు. ట్రాఫిక్ ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు ఎక్కడ డ్యూటీ చేస్తుంటారో అక్కడే ట్రాఫిక్ తరచూ స్తంభించిపోతుంది. ఆత్మకూరు బస్టాండ్ వద్ద సిటీబస్సులు రోడ్డు ప్రక్కన నిలిపితే ట్రాఫిక్ నిలబడి పోతుందని ఈ స్టాండ్‌ను బోసుబొమ్మ వద్దకు పాత ఎస్పీ లక్ష్మీరెడ్డి మార్చారు. కానీ ఆయన బదలీ కాగానే ట్రాఫిక్ పోలీసులు లంచాలు తీసుకొని ఆత్మకూరు బస్టాండ్ దగ్గరే బస్సులు నిలుపుకొనే అవకాశమిస్తున్నారు. ఆర్టీసి బస్టాండ్ దగ్గర చిన్న చిన్న మార్పులు చేస్తే అక్కడ ట్రాఫిక్ కుదుట పడుతుంది. మద్రాసు బస్టాండ్ దగ్గర రోడ్లపై వ్యాపారులను అదుపుచేస్తే పరిస్థితి మారిపోతుంది. విఆర్‌సి, గాంధీబొమ్మ సెంటర్లపై కాస్త దృష్టి పెడితే ట్రాఫిక్‌ను నియంత్రించవచ్చు కానీ కొత్తగా వచ్చిన సిఐ కూడా అటువంటి చర్యలవైపు దృష్టి సారించడం లేదు. టౌన్‌బస్సులు, షాపుల యజమానులు ఇచ్చే మామూళ్లు తీసుకొని గమ్మునుండి పోతున్నారు. ట్రాఫిక్ ఎస్‌ఐలు చలానాలు వ్రాస్తామని బెదిరించి జనాన్ని దోచుకొంటుంటే ఆ విభాగంలోని పోలీసులు అదే మార్గాన నడుస్తున్నారు.

# బ్లాక్‌లో ఓల్వోబస్సు టిక్కెట్



ఆర్టీసి నడిపే ఓల్వో బస్సు టిక్కెట్లు బ్లాక్‌లో అమ్మకాలు సాగిస్తుండడం చర్చనీయాంశమయ్యింది. ఆర్టీసి నెల్లూరు నుంచి బెంగుళూరుకు గరుడ పేరుతో ఓల్వో బస్సులను నడుపుతుంది. ప్రతిరోజూ రాత్రి 9.30 గంటల నుంచి 11.00 గంటల వరకు ఈ బస్సులు బెంగుళూరుకు వెళ్తాయి. ఈ బస్సుల వేళలు అనువుగా వుండడంతో వీటిలో ప్రయాణించేందుకు అధిక శాతం మంది మొగ్గు చూపుతుండడంతో బస్సుల్లో టిక్కెట్లు దొరక్క ప్రయాణీకులు అవస్థలు పడుతున్నారు. దీనిని అవకాశంగా చేసుకొని కొందరు ఆర్టీసి సిబ్బంది ప్రైవేట్ వ్యక్తులతో కలసి వీటిని బ్లాక్‌లో టిక్కెట్లు అమ్ముతున్నారు. 500 రూపాయలు వుండే ఈ బస్సు టిక్కెట్‌ను 700 నుంచి 800 రూపాయలకు నిలబెట్టి వసూలు చేస్తున్నారు. ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయాన్ని వినియోగించుకొని ముందుగానే టిక్కెట్లు బుక్ చేసుకొని అధిక ధరలకు అమ్ముతుండడంతో సామాన్యులు అంత ధర పెట్టి కొనుగోలు చేయలేక, ప్రయాణం మానుకోలేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

# చెమటలు పట్టించిన సుజాతరావు

## ఏ మాత్రం మారని పాత కలెక్టర్



నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డైరక్టర్ కె.సుజాతారావు వైద్య సిబ్బందికి చెమటలు పట్టించారు. జిల్లాలో సొసైటీ పనితీరును పరిశీలించేందుకు వచ్చిన ఆమె ప్రభుత్వ ఆస్పత్రిలో ఎయిడ్స్ నిరోధానికి తీసుకొంటున్న చర్యలపై ఆమె సంబంధిత సిబ్బంది, అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించిన సుజాతారావు ఎయిడ్స్ వ్యాధి కారణంగా చనిపోయిన వారి సంఖ్య రెండు సంవత్సరాలలో ఎక్కువగా వుండడంపై ఆగ్రహించారు. ఏం చేస్తున్నారు మీరు? నిధులిచ్చి, అవసరమైన మందులు, ఇతర సహాయాన్ని అందిస్తున్నా ఎందుకు తగినచర్యలు చేపట్టలేకపోయారంటూ ప్రశ్నల వర్షం కురిపించడంతో సిబ్బందికి నోటమాటరాలేదు. మరోసారి ఇదేవిధంగా పేలవమైన పనితీరును ప్రదర్శిస్తే సహించేదిలేదని ఇళ్లకు పంపిస్తానని ఘాటుగా హెచ్చరించారు. అనంతరం సుజాతారావు ప్రభుత్వ ఆస్పత్రిలోని రక్తనిధి కేంద్రాన్ని పరిశీలించి అక్కడి వసతులు, రక్త సేకరణపై సంతృప్తి వ్యక్తం చేయడంతోపాటు బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ కృష్ణమూర్తిని అభినందించారు. సుజాతారావు ఆస్పత్రి తనిఖీకి వచ్చినప్పుడు సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య తదితరులు వున్నారు.

# ప్రైవేట్ అంబులెన్స్‌ల హవా

నెల్లూరు పెద్దాసుపత్రిలో పనిచేసే సిబ్బంది ఎంత గుండెలు తీసిన బంటులో అక్కడ నిలిపి వుండే ప్రైవేట్ అంబులెన్స్‌లను పరిశీలిస్తే అర్థమవుతుంది. రాష్ట్రంలో ఎక్కడా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రైవేట్ అంబులెన్స్‌లను నిలిపి వుంచేందుకు అనుమతించరు. దీనికి భిన్నంగా పెద్దాసుపత్రిలో మాత్రం వీటిని నిలిపి వుంచేందుకు ఒక స్టాండ్‌నే అనుమతించారు. ప్రభుత్వ అంబులెన్స్ ఎక్కడో కనపడదమే కానీ ఇవి మాత్రం చెట్టుక్రింద ఆస్పత్రి ఆవరణలో వరుసగా నిలిపి వుండడం కన్పిస్తుంది. ఆస్పత్రి సూపరింటెండెంట్ నుంచి అందరూ వైద్యాధికారులకు ఈ సంగతి తెలిసినా ఎవ్వరూ వాటిని అక్కడి నుంచి బయటకు పంపేందుకు చర్యలు తీసుకొన్న దాఖలాలు లేవంటే అక్కడి వారికి వాటిపై ఎంత ప్రేమ వుందో తెలుస్తుంది. ఇటీవల హెల్త్ సెక్రటరీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం ఆస్పత్రికి తనిఖీకి వచ్చినప్పుడు మాత్రం అక్కడి సిబ్బంది సమాచారాన్ని ప్రైవేట్ అంబులెన్స్‌ల నిర్వాహకులు చెవిన వేయడంతో ఆ కొద్ది సేపు మాత్రం వాటిని బయటకు పంపించినా తర్వాత మాత్రం యధాతథంగా తెచ్చిపెట్టేశారు. ఆస్పత్రిలో ప్రైవేట్ అంబులెన్స్‌లు నిలిపి వుండడాన్ని జడ్పీ ఛైర్మన్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీకి ఛైర్మన్ అయిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆగ్రహించి, వీటిని తొలగించేందుకు చర్యలు తీసుకొని వైద్యాధికారులకు చెప్పినా ఆయన ఆదేశాలు ఖాతరు చేయలేదంటే వీరు ఎంతగా అవినీతికి పాల్పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

# ఆగని ప్లాస్టిక్ కవర్ల వాడకం

## పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు

పర్యావరణానికి పెనుముప్పని శాస్త్రవేత్తలు ఎంతగా ఆందోళన చెందుతున్నా ప్లాస్టిక్ కవర్ల వాడకం మాత్రం ఆగడం లేదు. ప్రభుత్వం వీటి వాడకాన్ని నిషేధించినా జిల్లాలో మాత్రం వీటిని యధావిధిగా వినియోగిస్తూనే వున్నారు. 20 మైక్రాన్ల మందం కన్నా తక్కువగా వుండే ప్లాస్టిక్ కవర్లను వాడడం వలన అవి మట్టిలో కలవక, పర్యావరణానికి పెనుముప్పుగా పరిణమించడంతో భూమిలో కొన్ని వేల సంవత్సరాలు అలాగే వుండడం వలన వర్షపు నీరు భూమిలో ఇంకడానికి ఇవి అడ్డంకిగా మారడం వలన భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం వుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనికి తోడు ఈ ప్లాస్టిక్ వ్యర్థపదార్థాలను పశువులు తినడం వలన అవి ప్రాణాల మీదకు తెచ్చుకొంటున్నాయి. కాలువలు సైతం ఈ ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయి నీటిపారుదలకు అడ్డంకిగా మారుతున్నాయి. బహిరంగంగా వ్యాపారులు వినియోగిస్తున్నా, అధికారులు ఎవ్వరూ వాటి నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టక పోవడం, ఎప్పుడో ఒకటి రెండు రోజులు దడబడలు సృష్టించి ఫైన్ వేసి చేతులు దులుపుకొంటుండడంతో ప్లాస్టిక్ కవర్ల వాడకం ఏమాత్రం తగ్గడం లేదు.



నెల్లూరు ఎసి సెంటర్‌లోని బాలాజీ మొబైల్ ఆరవ శాఖను ప్రారంభిస్తున్న నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యేలు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఆనం వివేకానందరెడ్డి. మేయర్ భానుశ్రీ, బాలాజీ గ్రూప్ మేనేజింగ్ డైరక్టర్ వై.డి.బాలాజీ చౌదరి ప్రక్కనున్నారు.

## తిరుగుబాటా? సర్దుబాటా?

మొదటి పేజీ కొరవ

లేదు. ఏమీ చెప్పకుండా, తమ అంతరంగం బయటపడకుండా గుంభనంగా వుంది అధిష్టానం. ఈ మౌనం జగన్ శిబిరాన్ని కలత పెడుతున్నది. తమ తదుపరి కర్తవ్యం ఏమిటో వారికి బోధపడడం లేదు. అధిష్టానం పెదవి విప్పే వరకు మౌనంగా వుండి పోవాలా? లేక ఒత్తిడి పెంచాలా? ఆ ఒత్తిడి ఎట్లా వుండాలి? రాష్ట్రంలో ఆందోళనలు, ఉద్యమాలు చేస్తే ఢిల్లీ వాళ్లు పట్టించుకొంటారా? లేక నేరుగా ఢిల్లీకి వెళ్లి గోల చేయాలా? అట్లా చేస్తే అసలుకే మోసం వస్తుందేమో? ముఖ్యమంత్రిత్వం తమకు ఇప్పట్లో దక్కకుంటే, ఇప్పటివరకు తమతో వున్న ఎమ్మెల్యేలు నిలుస్తారా? తమ వర్గం బలహీనపడుతుందా? దాన్ని ఎట్లా నిలబెట్టుకోవాలి? నెలలు, సంవత్సరాల పాటు అధిష్టానం వులుకు పలుకు లేకుండా కాలం వెళ్లదీస్తే ఏమి చేయాలి? అనామకంగా కాంగ్రెస్‌లో వుండి పోవడం మంచిదా? లేక స్వంత పార్టీ పెట్టుకోవడం మేలౌతుందా? కాంగ్రెస్‌లో వుంటే తమకు అండగా నిలబడినవారు కాంగ్రెస్ నుంచి బయటపడిన తర్వాత కూడా తమతో వస్తారా? వస్తే, ఎంత మంది?

ఇన్ని ప్రశ్నలతో వుక్కిరిబిక్కిరై పోతున్నాడు జగన్. ఆ శిబిరంలోని అయోమయం, అగమ్యగోచరత్వం కెవిపి రామచంద్రరావు ఇంటివద్ద ప్రతిఫలిస్తున్నది. దాదాపు ప్రతిరోజు ఆయన ఇంటి వద్ద ఇదే సందడి. మంత్రులు, ఎమ్మెల్యేలు అది పనిగా వచ్చి చర్చ పెడుతున్నారు. వారికి సమాధానం చెప్పడం కెవిపి తరం కావడం లేదు. కాంగ్రెస్‌ను కాదని రాజకీయంగా నిలదొక్కుకోవడం కష్టమన్నది కెవిపి రామచంద్రరావు భావన. గతంలో వైఎస్ కూడా ఇటువంటి ఆలోచన చేశాడని, అప్పట్లో అధిష్టానం బలహీనంగా వుండినా, పార్టీని వదలుకొంటే భవిష్యత్తు కష్టమౌతుందని వైఎస్ భావించారని, ఆయనే వద్దు అనుకొన్న తిరుగుబాటు ధోరణికి ఇప్పుడు తాము సాహసించడం జగన్ భవిష్యత్తు దృష్ట్యా మంచిది కాదని కెవిపి వాదిస్తున్నాడు. అయితే జగన్ వీర విధేయులైన ఒక వర్గం ఎమ్మెల్యేలు మాత్రం దీనితో ఏకీభవించడం లేదు. వైఎస్ పట్ల జనంలో వున్న సానుభూతి దృష్ట్యా తిరుగుబాటు చేసి, స్వంతపార్టీ పెట్టుకొంటే కాంగ్రెస్ కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకోవచ్చునని వారు పట్టుబడుతున్నారు. వారిని నియంత్రించడం పెద్ద సమస్యగా వుంది కెవిపికి.

---

## ఇందిరమ్మ ఇళ్లు

5వ పేజీ కొరవ

### పత్తాలేని కార్యదర్శులు

నిత్యం ఇందిరమ్మ గృహనిర్మాణ పథకాన్ని పరిశీలించాల్సిన గ్రామ పంచాయితీ కార్యదర్శులు పత్తాలేకుండా పోతున్నారు. ఇదిలా వుండగా ఎస్సీ, ఎస్టీ లబ్దిదారుల పరిస్థితి మరింత దారుణంగా వుంది. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఇల్లు నిర్మించుకోలేక పోతున్నారు. ఇటువంటి వారికి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించింది.

---

## ప్రధాని పట్టుదల

16వ పేజీ కొరవ

రాజకీయంగా అనుభవం, ఆర్థిక వ్యవహారాలలో అవగాహన కల్గి వుండడంతో పాటు, అవినీతి మచ్చలేని రోశయ్యను కొనసాగించడమే పార్టీకి మంచిదని అధిష్టానం అభిప్రాయపడుతున్నట్లు అర్థమౌతున్నది. రోశయ్యకు అన్ని విధాల సహకారం అందించాలని ప్రధాని పట్టుదలగా వున్నారట.

---

## సమఉజ్జీ నువ్వే

16వ పేజీ కొరవ

లన్న ఆలోచనలో అధిష్టానం వుంది. ప్రజాదరణలో జగన్‌కు సమఉజ్జీవిగా, ఇంకా చెప్పాలంటే ఒక మెట్టు పైన నిలవగలిగిన నువ్వు కాంగ్రెస్‌లోకి వస్తే, ఎంతో భవిష్యత్తు వుంటుంది. రేపటి ఎన్నికల సమయానికి పార్టీలో బాగా కుదురుకోవచ్చు... అని నచ్చచెప్పాడట రోశయ్య. దానికి చిరంజీవి సమాధానం ఏమిటో తెలియదు. అయితే వీరిద్దరి మధ్య జరిగిన సమావేశం పట్ల జగన్ వర్గీయులు గుర్రుగా వున్నారు. ఏమీ తెలియని వాడివలె అమాయకంగా కనిపించే రోశయ్య తమను కట్టడి చేయడానికి ఇటువంటి పద్మవ్యూహం రచించడం జగన్ శిబిరానికి ఎంత మాత్రం నచ్చడం లేదు.

---

## జనవాణి

2వ పేజీ కొరవ

### ట్రాఫిక్ సలహా మండలిని సమావేశపర్చండి!

నెల్లూరు నగరంలో ట్రాఫిక్ అబందరగా తయారైవుంది. ట్రాఫిక్‌లో ఎప్పటికప్పుడు మార్పులను చేయను 1993లో అప్పటి ఎస్పీ కృష్ణప్రసాద్ ట్రాఫిక్ అడ్వయిజరీ కమిటీని ఏర్పాటు చేశారు. చిత్రమేమిటంటే గత ఐదేళ్లుగా ఈ అడ్వయిజరీ కమిటీ ఒక్కసారి కూడా సమావేశమవ్వలేదు. ఈ కమిటీలో 16 ఏళ్లుగా సభ్యుడిగా వున్నాను. ఇప్పటికిప్పుడు నగరంలో నడిచే ట్రాఫిక్‌లో 43 అంశాలలో మార్పు చేర్పులు చేస్తే గందరగోళం లేకుండా నడుస్తుంది. జనజీవనంపై ప్రభావం చూపే ట్రాఫిక్ విషయమై అధికారులు పట్టించుకోకపోతే ఎలా?

వామ్మిన సుబ్రహ్మణ్యం, నెల్లూరు

### అర్థంలేని వాదన

జనగణమణ, వందేమాతరం గీతాలను ఎవరెవరో ఎన్నో సినిమాలలో వాడుతుంటారు. ఘంటసాల పాడిన భగవద్గీత శ్లోకాలు, అన్నమయ్య, త్యాగయ్య కీర్తనలు అంతే. వీరంతా ఎవరికి రాయల్టీ చెల్లించారు. మగధీర చిత్రంలో కేవలం 'ఏం పిల్లడో, ఎల్దామొస్తవా' చరణాన్ని మాత్రమే వాడారు. టాస్ సినిమాలో అయితే పూర్తి పాటను వాడారు. దానికిలేని అభ్యంతరాన్ని మగధీర విషయంలో గాయకుడు వంగపండు ప్రసాదరావు సృష్టించి రభస చేశారు. ఆయనలాంటి పెద్ద మనిషి చేయాల్సిన గొడవ కాదిది.

టి.కోటేశ్వరరావు, కోవూరు



రంజాన్ పండుగను పురస్కరించుకొని ఈద్గా వద్ద ధార్మికోపన్యాసం చేస్తున్న మతపెద్ద అబూబకర్.



నెల్లూరు విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ నేతృత్వంలో జరిగిన దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి చిత్రపటావిష్కరణ కార్యక్రమంలో నేతాజీ స్కూల్ సుబ్బారెడ్డి, పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య, బాలాజీ చౌదరి తదితరులు

---

## నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

ఆసుపత్రికి తరలించమన్నారు. చిన్నపిల్లల ఆసుపత్రికి వేణును తీసుకొచ్చేసమయానికి డ్యూటీ డాక్టర్ లేకపోవడంతో బాలుడు మరణించాడు. వేణు తండ్రి కరెంట్‌షాక్‌కు గురై చనిపోయాడట. వేణుకు డాక్టర్లు సకాలంలో వైద్యం చేయక చంపేశారు. ఈ ఘటనను పరికిస్తే డాక్టర్లలో మానవత్వం మృగ్యమవుతుందని స్పష్టమవుతుంది.

### కీచక పోలీస్

నెల్లూరు పోలీసులు అన్ని కళల్లో ఆరితేరారు. దసరా సెలవులకు తన అక్క ఇంటికి వచ్చిన బాలికపై జాతీయ రహదారిపై గస్తీ బాధ్యతలు చూసే కానిస్టేబుల్ రవి, కోటరాజుపాళెం గ్రామంలో అత్యాచారయత్నం చేశాడు. బాలిక తినుబండారాలు కొనుగోలు చేయను అంగడికి వచ్చిన సందర్భంగా ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడు.

### సుందరేశ్వరునికి వజ్రాల నామాలు

నెల్లూరు రాజరాజేశ్వరి దేవస్థానంలో కొలువై వున్న సుందరేశ్వరస్వామికి వదాన్యుడు ఆల్తూరి ఆదినారాయణరెడ్డి త్రినేత్రంతో కూడిన వజ్రాలు పొదిగిన నామాలు అందజేశారు. గతంలో ఈయన షిర్డి సాయిబాబాకు బంగారు సింహాసనం, మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో రిపేర్లు, రాజరాజేశ్వరమ్మకు పలు బంగారు ఆభరణాలు చేయించి ఇచ్చారు.

### ఆకట్టుకొన్న నాటిక

నెల్లూరు విఆర్ కాలేజి మైదానంలో 22వ తేది జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం వజ్రోత్సవ సభలో ప్రజానాట్య మండలి కళాకారులు ప్రదర్శించిన తెలంగాణా సాయుధ పోరాట నాటిక సభికులను కట్టిపడేసింది. ఈ నాటిక ఆనాటి పరిస్థితులను కళ్లకు కట్టడంతో సభికులు సంభ్రమాశ్చర్యాలకులోనై చూశారు.

### విశ్వశాంతి ఆశ్రమంలో దసరా

రాపూరులోని మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 19వ తేది ప్రారంభమయ్యాయి. 28వ తేది వరకు ఇవి జరుగుతాయి. 26వ తేది దుర్గాష్టమి సందర్భంగా దుర్గాపూజ, చండీహోమం, 28వ తేది విజయదశమి సందర్భంగా శతచండీహోమం జరుగుతాయి. విజయదశమి పండుగరోజే కరుణామయి అమ్మ జన్మదినోత్సవం జరుగుతుందని భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనమంటున్నారు నిర్వాహకులు.

### వెంగమాంబ నిత్యారాధన ట్రస్ట్‌లో దసరా

నర్రవాడలోని జగన్మాత వెంగమాంబ నిత్యారాధనా ట్రస్ట్ నేతృత్వంలోని వెంగమాంబ దేవస్థానంలో దసరా ఉత్సవాలు 19వ తేది ప్రారంభమయ్యాయి. 28వ తేది వరకు ఇవి జరుగుతాయి. 26వ తేది దుర్గాదేవి, 27వ తేది మహిషాసురమర్ధిని, 28వ తేది జగన్మాత వెంగమాంబ అలంకారంలో అమ్మ భక్తులకు దర్శనమిస్తుందని నిర్వాహకులు చెప్పారు.

# ముఖ్యమంత్రిగా రోశయ్య సమర్థుడే!

డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హఠాత్ మరణంతో రాష్ట్ర రాజకీయాల్లో చోటుచేసుకొన్న పరిణామాల నేపథ్యంలో ఆర్థిక మంత్రిగా వుండిన కొణిజేటి రోశయ్య ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ కేంద్ర నాయకత్వ నిర్ణయంతో ఆయన ఆ బాధ్యతలు చేపట్టాల్సి వచ్చింది. వైఎస్ ముఖ్యమంత్రిగా వున్న సమయంలో మంత్రివర్గంలో వున్నవారిలో అధికభాగం మంత్రులు మాత్రం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనయుడు జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలన్న తమ డిమాండ్‌ను అధిష్టానానికి విన్నిస్తునే వున్నారు. వారి డిమాండు ఎలా వున్నా రోశయ్య మాత్రం అధిష్టానం తనపై వుంచిన బాధ్యతలను తూచ తప్పకుండా పాటించేందుకు నడుంబిగించారు. పాలనాపరంగా తనకున్న అపారమైన అనుభవాన్ని రంగరించి పాలన సజావుగా సాగేందుకు చకచకా చర్యలు చేపడుతున్నారు. ఆర్థికభారాన్ని చక్కదిద్దేందుకు పొదుపు చర్యలు చేపడుతూనే మరోవైపు ప్రజల ఇబ్బందులను ఎప్పటికప్పుడు గమనిస్తూ క్షణం తీరికలేకుండా వుంటూ ఫైళ్లను త్వరితగతిన పరిష్కరిస్తున్నారు. మంత్రులు సహకరించకపోయినా ఆ లోటు ఎక్కడా కన్పడకుండా అన్నీ తానై అధికారులతో సమీక్షాసమావేశాలు నిర్వహిస్తూ గంటల తరబడి సచివాలయంలోనే గడుపుతూ మెల్లమెల్లగా పాలనపై తనదైన ముద్ర వేసుకొనే ప్రయత్నం చేస్తున్నాడు. దీక్షా దక్షతలకు పెట్టింది పేరైన రోశయ్య ముఖ్యమంత్రిగా ఎంతవరకు సక్సెస్ అవుతాడనే దానిపై పలువురి అభిప్రాయాలు ప్రకృనిస్తున్నాం.



### రోశయ్య సమర్థుడు



ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రోశయ్య ఈ పదవికి సమర్థుడైన వ్యక్తి. జననేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మరణంతో ఖాళీయైన సిఎం కుర్చీని భర్తీ చేయాల్సివచ్చినప్పుడు కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ అన్నీ ఆలోచించి సమర్థుడు, పాలనలో విశేష అనుభవం వున్న వ్యక్తి కాబట్టే రోశయ్యను ముఖ్యమంత్రి చేశారు. తన అనుభవంతో వైఎస్ చేపట్టిన పథకాలకు పూర్తి న్యాయం చేయగలసత్తా రోశయ్యకు వుంది.

**మోహన్‌రావు**, నెల్లూరు

### జగన్‌ను సిఎం చేయాలి!



ప్రస్తుతం ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వర్తిస్తున్న రోశయ్య అనుభవం వున్న వ్యక్తే. అయినప్పటికి వయోభారం ఆయనకు అడ్డంకి. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన ప్రజాకర్షక పథకాలు కొనసాగాలన్నా, ఆయన ఆశయాలు కొనసాగాలన్నా వైఎస్.జగన్‌ను ముఖ్యమంత్రి చేయాలి. అప్పుడే వైఎస్ కన్న కలలు నిజమవుతాయి, పేదలకు న్యాయం జరుగుతుంది. కాంగ్రెస్ అధిష్టానం ఆ దిశగా ఆలోచించి సరైననిర్ణయం తీసుకోవాలి.

**మునిస్వామిరెడ్డి**, నెల్లూరు

### ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టాలి!



రాష్ట్రంలో ఎవరైనా ముఖ్యమంత్రి అయ్యేందుకు అర్హత వుంది. రాజశేఖర్‌రెడ్డి మరణంతో రోశయ్య ఆ పదవి చేపట్టారు. ఎవరు ముఖ్యమంత్రి అయ్యారన్నది కాదు ముఖ్యం. ప్రజలు పడే బాధలు, ఇబ్బందులను తొలగించి జనరంజకమైన పాలన అందించినప్పుడు ఆ పదవికి సార్థకత.

**పి.వి.రమణ**, నెల్లూరు

# సామ్రాజ్యవాదంతో వ్యవసాయరంగానికి ముప్పు!

దేశంలోను, రాష్ట్రంలోను ప్రస్తుతం వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో వుందని వామపక్ష నేతలు అభిప్రాయపడ్డారు. 22వ తేది నెల్లూరు నగరంలో వ్యవసాయ కార్మికసంఘం వజ్రోత్సవ సభ జరిగింది. ఈ మహాసభలకు సిపిఎం కేంద్రకమిటి నాయకులు, రాష్ట్రనాయకులు హాజరైనారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాల కారణంగా ఆర్థికమాంద్యం ఏర్పడి పేద ప్రజల జీవనవిధానం మరింత దుర్భరంగా మారిందని అభిప్రాయపడ్డారు.

సహకార వ్యవసాయం పేరుతో దేశాన్ని విదేశాలకు తాకట్టు పెట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేయడం పట్ల కూడా వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. పేదల జీవన విధానాన్ని దెబ్బతీసే విధంగా ప్రయత్నిస్తే అందుకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మిక సంఘం ముందుండి పోరాటం చేయాలని నిర్ణయించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా వ్యవసాయ కూలీలు ఎన్ని రోజులు పని కావాలని అడిగితే అన్ని రోజులు పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై వుంది. అయితే అలా కాకుండా సంవత్సరంలో 100 రోజులు మాత్రమే పని కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు.

వ్యవసాయ కార్మిక సంఘం వజ్రోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రం, జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా సిపిఎం కార్యకర్తలు నగరానికి తరలి వచ్చారు. ముదిగొండలో గత సంవత్సరం జరిగిన పోలీస్ కాల్పుల్లో మరణించిన వారితోపాటు నెల్లూరు జిల్లాలో వివిధ ఉద్యమాలలో అశువులు బాసిన వారికి ఈ మహాసభలో నివాళులర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం నిర్మాణానికి పునాదులు వేసిన పుచ్చలపల్లి సుందరయ్య స్వగ్రామం అలగానిపాడు నుంచి కార్యకర్తలు జ్యోతి తీసుకొని తరలిరావడం ప్రత్యేకత సంతరించుకొంది.

ప్రస్తుతం వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని గురించి మహాసభలకు విచ్చేసిన నాయకులు వెల్లడించిన అభిప్రాయాలు దిగువనిస్తున్నాం.



నెల్లూరులో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొన్న కార్మికులు. ఇన్‌సెట్‌లో అలగానిపాడు నుంచి వచ్చిన జ్యోతిని అందుకొంటున్న ప్రకాష్ కారత్.

### ప్రభుత్వ విధానాలు మారాలి



దేశంలో వ్యవసాయరంగం దెబ్బతినకుండా వుండాలంటే ప్రభుత్వ విధానాలు తప్పని సరిగా మారాల్సి వుంది. సహకార సేద్యం పేరిట మన దేశంలోని భూములను విదేశాలకు తాకట్టుపెట్టే ఆలోచనను విరమించుకోవాలి. దేశంలో ప్రత్యేక ఆర్థికమండళ్ల పేరిట పేదల భూములను బడా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అప్పగించి వారి నుంచి ఎటువంటి పన్నులు వసూలు చేయకపోవడం వలన ఆర్థిక అసమతుల్యత ఏర్పడుతుంది.

**ప్రకాష్‌కారత్**, సిపిఎం జాతీయ కార్యదర్శి

### సామ్రాజ్యవాదంతో ప్రమాదం



సామ్రాజ్యవాదం వలన మన వ్యవసాయరంగానికి ప్రమాదం ఏర్పడే అవకాశం వుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఏర్పడింది. దేశంలో సంపన్నవర్గాలు, బడా పారిశ్రామికవేత్తల నుంచి పన్నులు సక్రమంగా వసూలు చేస్తే దేశ ఆర్థికపరిస్థితి మెరుగుపడే అవకాశం వుంది.

**పాటూరు రామయ్య**, వ్యవసాయ కార్మికసంఘం అధ్యక్షులు

### కార్మికులను విస్మరిస్తే పతనం తప్పదు!



దేశంలో వివిధ రంగాలలో పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వాలు పట్టించుకోకపోతే అటువంటి ప్రభుత్వాలను ప్రజలు తిరస్కరిస్తారు. దేశానికి వెన్నెముకలాంటి రైతులకు, వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వాలు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలన్న నినాదంతో వ్యవసాయ కార్మిక సంఘం అనేక పోరాటాలు చేపడుతుంది.

**మల్లు స్వరాజ్యం**, తెలంగాణా పోరాట యోధురాలు

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/09-11


# కాంగ్రెస్ కొంగుకు ప్రజారాజ్యం ముడి

## ● శ్రీధరకృష్ణారెడ్డి రాజకీయ పోకడ సరిలేదు



జిల్లా ప్రజారాజ్యం కన్వీనర్‌గా సిటీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిని నియమించారు. ప్రజారాజ్యం కార్యకర్తలందరినీ ఆశ్చర్యపరచిన నియామకం ఇది. ఆ పార్టీకి జిల్లాలో వున్న ఏకైక ఎమ్మెల్యే శ్రీధరకృష్ణారెడ్డి. కానీ గెలిచిన మరుసటి రోజు నుంచే పార్టీని మట్టిలో కలిపి, కాంగ్రెస్‌తో చెట్టాపట్టాలు వేసుకొని తిరుగుతున్నాడాయన. తానొక ఎమ్మెల్యే అనే మాట కూడా మరచిపోయి ఆనం వారితో అంట కాగుతున్నాడు. గత వారంలో ఒకరోజు మగధీర సినిమా 50 రోజుల ఉత్సవానికి సంబంధించి చిరంజీవి అభిమానులకు, కాంగ్రెస్ కార్యకర్తలకు ఘర్షణ జరిగితే, పోలీసు స్టేషన్‌కు ఫోన్ చేసి చిరంజీవి అభిమానుల మీద కేసు పెట్టమని ఒత్తిడి తెచ్చాడట. ఆ స్టేషన్ ఎస్ఐ నేరుగా ఆ నిజం బయటపెట్టడంతో, ప్రజారాజ్యం కార్యకర్తలంతా కలిసి ఆయన ఇంటి ముందు ధర్నా చేయడానికి సిద్ధమైనారు. మధ్యవర్తుల జోక్యంతో ఆ వివాదం సమసిపోయింది. కాంగ్రెస్ నాయకుల మెహర్బానీ కోసం తన స్వంత పార్టీ కార్యకర్తల మీద కేసు పెట్టమని సిఫార్సు చేసే వ్యక్తికి, పార్టీ జిల్లా పెత్తనం అప్పచెప్పడాన్ని కార్యకర్తలు జీర్ణించుకోలేక పోతున్నారు. చిరంజీవికి తన పార్టీ మీద వున్న అవగాహన ఎంత బలహీనమైనదో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు.

శ్రీధరకృష్ణారెడ్డి వ్యక్తిగా సౌమ్యుడు, వివాదరహితుడు, సంస్కారి. కానీ ఆయన రాజకీయ పోకడ మాత్రం, రాజకీయాలు ఇంత నీచంగా వుంటాయా అన్న ఏహ్యభావం కల్గేట్లు వుంటున్నది. ఆయనకు నెల్లూరు నగరం చుట్టూ రియల్ ఎస్టేట్ ఆస్తులున్నాయి. అధికార పార్టీ కన్నెర్ర చేసినా, మునిసిపల్ అధికారులు ఒక పట్టు పట్టినా వాటికి ఇబ్బంది అనే భయంతో కాంగ్రెస్‌వాదులతో మమేకమౌతున్నాడు. తానూ ఎమ్మెల్యే అనే మాట కూడా మరచిపోయి, కాంగ్రెస్ ఎమ్మెల్యేల పాదసేవ చేస్తున్నాడు. తన స్థాయిని తానే తగ్గించుకొంటున్నాడు. అటువంటి వాడి చేతిలో జిల్లా పార్టీ పెత్తనం పెట్టడం అంటే, కాంగ్రెస్ కొంగుకు ముడేయడంతో సమానం. ఒక ప్రతిపక్ష పార్టీకి ఇంత కంటే హీనమైన పరిస్థితి వేరొకటి వుండదని భావించలేము.

శ్రీధకృష్ణారెడ్డి నియామకానికి నిరసనగా ప్రజారాజ్యం ప్రస్తుత కన్వీనర్, శాసనమండలి సభ్యుడు బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి పార్టీకి రాజీనామా చేశాడు. ఎన్నికల నాటి నుంచే ఆయనకు కాంగ్రెస్ మీద మోజు ఏర్పడింది. ప్రజారాజ్యాన్ని నమ్ముకొంటే భవిష్యత్తు వుండదన్న అభిప్రాయం కల్గింది. అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ నియామక ప్రకటనతో తన కోరిక తీర్చుకున్నాడు.

ప్రజారాజ్యం తరపున మొన్నటి ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులెవరూ ఇప్పుడు రాజకీయంగా చురుకుగా లేరు. నిరాశ నిస్పృహలతో ఎవరికివారు రాజకీయాలకు దూరమై పోయారు. ఇప్పుడు ఆ పార్టీలో వున్నది చిరంజీవి అభిమానులు మాత్రమే. వారికి దిక్కు తెన్ను చూపించవలసిన జిల్లా అధ్యక్షుడి స్థానంలోకి కాంగ్రెస్ బంటుగా మెలిగే శ్రీధరకృష్ణారెడ్డి వచ్చాడు. ఇక ఆ పార్టీ అస్థిత్వం గాలిలో కలిసిపోయినట్లే లెక్క

# ప్రధాని పట్టుదల



ముఖ్యమంత్రి రోశయ్యను దీర్ఘకాలం కొనసాగించాలని ప్రధాని మన్మోహన్ సింగ్ స్థిర నిర్ణయానికి వచ్చినట్లు ఢిల్లీ వర్గాల వర్తమానం. రాజకీయాలలో, ప్రజాజీవితంలో అత్యున్నత స్థాయి విలువలకు, నైతిక ప్రమాణాలకు ప్రాధాన్యత ఇచ్చే మన్మోహన్ సింగ్, జగన్ విషయంలో ఒక నిర్దిష్ట అభిప్రాయానికి వచ్చాడని ఒక అభిప్రాయం. గత ఐదేళ్లలో జగన్ వ్యాపార సామ్రాజ్యం వేల కోట్లకు విస్తరించడానికి రాజకీయ అవినీతే కారణమని, అటువంటి శక్తులను ప్రోత్సహించడం వల్ల రాజకీయాలలో విలువలు మరింత పతనమై పోతాయని ఆయన వ్యాఖ్యానించినట్లు చెప్తున్నారు. జగన్ ఆస్తుల విలువపై ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా ఆయన సమాచారం సేకరించారట. జగన్ కంపెనీలన్నిటిలో షేర్ల విలువ 78 వేల కోట్ల వరకు వుందని ఆ సమాచారంలో తేలిందని, సత్యం కేసు దర్యాప్తు చేస్తున్న సిబిఐ అధికారులు కూడా దాన్ని ధృవపరిచారని, దానితో మన్మోహన్ సింగ్ జగన్ పేరు పక్కన పెట్టాడని వదంతులు విన్పిస్తున్నాయి. మెయిల్ టుడే, టైమ్స్ ఆఫ్ ఇండియా వంటి ఆంగ్ల దినపత్రికలు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తూ వార్తలు ప్రచురించడం గమనార్హం. కేంద్ర ఆర్థికమంత్రి ప్రణబ్ ముఖర్జీ, హోంమంత్రి చిదంబరం ఇదే అభిప్రాయంతో వున్నట్లు తెలుస్తున్నది. కాంగ్రెస్ కోర్ కమిటీలో అతి ముఖ్యులైన ఈ ముగ్గురు నేతలకు జగన్ పట్ల సదభిప్రాయం లేకపోవడం వల్లనే, సోనియాగాంధీ సైతం మౌనం వహిస్తున్నారని పరిశీలకుల భావన.

కొరవ 14వ పేజీలో







## కార్టూన్ స్కేప్



చూశావా... బట్టతల, భుజాన కండువా అచ్చం పీవీనే గుర్తుకొస్తున్నారు!

# జగన్‌కు సమఉజ్జీవి నువ్వే!

## ● చిరుకు రోశయ్య గాలం

బ్రహ్మోత్సవాల అంకురార్పణకు తిరుమల వెళ్లిన ముఖ్యమంత్రి రోశయ్య, ప్రజారాజ్యం అధినేత చిరంజీవితో ఆంతరంగిక సమావేశం జరిపారు. తిరుమల అతిథి గృహానికి చిరంజీవిని ఆహ్వానించి, సుదీర్ఘంగా మంతనాలాడారు. అవేమిటన్నది అందరిలో ఆసక్తిరేకెత్తి స్తున్నది.

ఎంతవరకు నిజమో కానీ, చిరంజీవిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారని ఒక వార్త. కాంగ్రెస్ అధిష్టానం ధోరణిలో మార్పు వచ్చింది. ఇదివరకటి వలె ఒక నాయకుడికి పెత్తనం అప్పచెప్పే పరిస్థితి లేదు. ఇప్పుడు కాంగ్రెస్‌లో ప్రజాకర్షణ వున్న నాయకుడు వైఎస్ జగన్ ఒక్కడే. ఆయన్ను నియంత్రించా

కొరవ 14వ పేజీలో

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.